www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -217 మంగళవారం 24 నవంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

తప్పు మీరు చేసి మాపై నిందలా?

కృష్ణా జలాల కేటాయింపులపై బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు



- ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకాలు చేసింది మీరే కాదా?

- కేసీఆర్, హరీశ్‌రావు సమాధానం చెప్పాలి

- పల్నాడు వాటర్‌గ్రిడ్‌పై కేంద్రానికి, కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేశాం

హైదరాబాద్,నవంబర్ 23,(ప్రజావినికిడి):

కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు అన్యాయం జరగడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయించేందుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అంగీకరించి సంతకాలు చేశారని ఆరోపించారు. తెలంగాణ నీటి హక్కులను తాకట్టు పెట్టిన మీరు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంలో కేసీఆర్, హరీశ్‌రావు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.సోమవారం హైదరాబాద్‌లోని**మిగతా 2లో...**

మావోయిస్టుల పునరావాసం..

రూ.5.59 కోట్లు విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం



హైదరాబాద్,నవంబర్ 23,(ప్రజావినికిడి):

తెలంగాణలో జనజీవన స్రవంతిలో కలిసేందుకు లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తోంది. తమ పునరావాస విధానంలో భాగంగా లొంగిపోయిన 214 మంది మాజీ మావోయిస్టులకు నేడు రూ.5.59 కోట్ల నగదు ప్రోత్సాహకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఆయుధాలు విడిచిపెట్టి వచ్చిన వారికి పునరావాసం కల్పించి, వారిని తిరిగి సమాజంలో భాగం చేసే ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్య తీసుకున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2025 అక్టోబర్ 21న సాయుధ పోరాటాన్ని విడనాడి, జనజీవన స్రవంతిలో కలవాలని ఇచ్చిన పిలుపుతో లొంగుబాట్లు ఊపందుకున్నాయని ఆయన వివరించారు.**మిగతా 2లో...**

నేపాల్‌అభివృద్ధికి రూ.15,000 కోట్లు



భారీ ప్యాకేజీ ప్రకటించిన భారత్

ప్రధాని మోదీ, నేపాల్ ప్రధాని బాలేన్ షా మధ్య ఫలవంతమైన చర్చలు

రెండు దేశాల మధ్య 8 కీలక అవగాహన ఒప్పందాలపై సంతకాలు

కష్టకాలంలో భారత్ అండగా నిలుస్తుందని నేపాల్ ప్రధాని ప్రశంస

రోడ్, రైల్, సరిహద్దు కనెక్టివిటీ పెంచాలని ఇరు దేశాల నిర్ణయం

న్యూఢిల్లీ , నవంబర్ 23,(ప్రజావినికిడి):

భారత్, నేపాల్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహ సంబంధాలు మరింత బలపడ్డాయి. నేపాల్ అభివృద్ధికి, పునర్నిర్మాణానికి మద్దతుగా నిలుస్తూ భారత ప్రభుత్వం భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది. నేపాల్ ప్రధాని బాలేన్ షాతో న్యూఢిల్లీలో జరిగిన ద్వైపాక్షిక సమావేశం అనంతరం,**మిగతా 2లో...**

కాంగ్రెస్ కు ఎటిఎంలా రేవంత్ రెడ్డి

రేవంత్‌రెడ్డి ప్రజలకు కాదు.. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు సేవ

కరీంనగర్‌లో నితిన్ నబీన్ మహా పాదయాత్ర.. కాంగ్రెస్‌పై నిప్పులు

రేవంత్‌రెడ్డి ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ప్రారంభమైంది

2028లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు.. ఎస్ఐఆర్‌కు మద్దతుగా వ్యాఖ్యలు



డిసెంబర్ 7 నుంచి 9 వరకు

గ్లోబల్ సమ్మిట్

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష..

ఇతర రాష్ట్రాల సీఎంలకూ ఆహ్వానం

భారత్ ఫ్యూచర్ సిటీలోని స్కిల్స్ వర్సిటీలో ఏర్పాట్లు

80 వేల చదరపు మీటర్లలో భారీ మల్టీ సెక్టార్ ఎక్స్‌పో

వెయ్యికి పైగా దేశ విదేశీ సంస్థల ప్రతినిధుల రాక

ఎయిర్ షో, క్లైమేట్ కాంక్లేవ్, ఎడ్యుకేషన్ ఎక్స్‌పోల నిర్వహణ



హైదరాబాద్ , నవంబర్ 23,(ప్రజావినికిడి):

రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులను భారీగా ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026'ను నిర్వహించనుంది. 'భారత్ ఫ్యూచర్ సిటీ'లోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు మూడు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. సుమారు 80 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో అతిపెద్ద బహుళ రంగాల ఎక్స్‌పోగా దీనిని **మిగతా 2లో...**



తొలగని ప్రతిష్టంభన

కృష్ణా డెల్టాకు నీళ్లివ్వలేమన్న తెలంగాణ, ఇవ్వాల్సిందేనన్న ఏపీ.. ఎటూతేలకుండానే ముగిసిన కేఆర్ఎంబీ సమావేశం

కృష్ణా జలాల కేటాయింపుల వివాదం

అసంపూర్ణంగా ముగిసిన కేఆర్ఎంబీ భేటీ

19 టీఎంసీలు కోరిన ఏపీ

కృష్ణా డెల్టాకు నీరివ్వడం సాధ్యం కాదన్న తెలంగాణ

డెల్టా అవసరాల కోసం పట్టుబట్టిన ఏపీ అధికారులు

హైదరాబాద్ నవంబర్ 23,(ప్రజావినికిడి):

హైదరాబాద్‌లోని జలసౌధ వేదికగా సోమవారం జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) త్రిసభ్య కమిటీ సమావేశం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. నాగార్జునసాగర్ నుంచి నీటి కేటాయింపులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో చర్చలు కొలిక్కి రాలేదు.**మిగతా 2లో...**

డేటా ఆధారిత నిర్ణయాలతోనే మెరుగైన ఫలితాలు

రాబోయే రోజుల్లో కీలకం అవుతాయి: సీఎం చంద్రబాబు

వైద్యం వ్యవసాయ రంగాల్లో ఏఐ వినియోగానికి సీఎం ఆదేశం

ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం ఉండకూడదని స్పష్టీకరణ

డేటా ఆధారిత నిర్ణయాలతోనే పాలనలో మెరుగైన ఫలితాలు అని వెల్లడి

ఉద్యోగుల పనితీరు పెంపునకు ప్రత్యేక శిక్షణ



అమరావతినవంబర్ 23,(ప్రజావినికిడి):

వైద్యారోగ్యం నుంచి వ్యవసాయం వరకు అన్ని కీలక రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకుని పాలనలో మెరుగైన ఫలితాలు సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతిలో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్)పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఏఐ స్టాక్ సాయంతో ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడంతో పాటు, ఆయా శాఖల పనితీరును, ప్రభుత్వ ఆదాయాలను మెరుగుపర్చాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.పాలనా విభాగాల్లో రెవెన్యూ, లీగల్ ఏఐ స్టాక్ ద్వారా వివిధ అంశాలను విశ్లేషించి, అత్యుత్తమ ఫలితాలు రాబట్టేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం వివరించారు. రాబోయే రోజుల్లో డేటా ఆధారిత నిర్ణయాలు (డేటా డ్రివెన్ డెసిషన్ మేకింగ్)**మిగతా 2లో...**

ఆలయాలను కూల్చడమేనా?

తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలో అభయాంజనేయ స్వామి ఆలయం కూల్చివేత

కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన వైసీపీ అధినేత జగన్

ఎన్‌హెచ్ 716 విస్తరణ పనుల్లో భాగంగా ఆలయాన్ని తొలగించిన యంత్రాంగం

ఆలయానికి ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను వివరించిన మాజీ టీటీడీ చైర్మన్ భూమన

ధనిక వర్గాల ఆస్తులను కాపాడేందుకే అలైన్‌మెంట్ మార్చారని భూమన ఆరోపణ



అమరావతి, నవంబర్ 23,(ప్రజావినికిడి):

తిరుపతి జిల్లా రేణిగుంట మండలం అంజనేయపురంలో శతాబ్దాల చరిత్ర కలిగిన అభయాంజనేయ స్వామి ఆలయాన్ని అధికారులు కూల్చివేశారంటూ వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వాన్ని తప్పుబడుతూ ఆయన సోషల్ మీడియా వేదికగా తీవ్ర **మిగతా 2లో...**

కాంగ్రెస్ సర్కార్ వత్తాసు

పల్నాడు వాటర్ గ్రిడ్ పనులు వెంటనే నిలిపివేయాలి

కృష్ణా నది యాజమాన్య బోర్డుకు బీఆర్ఎస్ ఫిర్యాదు



హైదరాబాద్: నవంబర్ 23,(ప్రజావినికిడి):

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న నీటి తరలింపు పనులకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పరోక్షంగా మద్దతు ఇస్తోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలను పక్కనపెట్టి ఏపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.**మిగతా 2లో...**

తొలగని ప్రతిష్టంభన

మొదటిపేజీ తరువాయి

ఈ నేపథ్యంలో నీటి పంపకాల అంశాన్ని పూర్తిస్థాయి బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయించాలని అధికారులు నిర్ణయించారు.ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ అవసరాల నిమిత్తం 19 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరగా, తెలంగాణ ప్రభుత్వం వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు తమకు 21 టీఎంసీలు అవసరమని ప్రతిపాదించింది. ఇరు రాష్ట్రాలు తమ అవసరాల మేరకు నీటి విడుదలకు పట్టుబట్టడంతో బోర్డు ఎలాంటి నిర్ణయాన్ని ఖరారు చేయలేకపోయింది. ఇదే సమయంలో తెలంగాణ అధికారులు పల్నాడు వాటర్ గ్రిడ్ అంశాన్ని లేవనెత్తగా, ఆ పనులను గ్రామీణ నీటి సరఫరా శాఖ పర్యవేక్షిస్తోందని, తమ వద్ద ఆ వివరాలు లేవని ఏపీ జలవనరుల శాఖ అధికారులు స్పష్టం చేశారు.సమావేశం అనంతరం తెలంగాణ ఇంజినీర్-ఇన్-చీఫ్ రమేశ్‌బాబు మీడియాతో మాట్లాడుతూ...ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో కేవలం 45 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని తెలిపారు. వచ్చే ఏడాది జూలై వరకు ఈ నీటిని ఎంతో పొదుపుగా వాడుకోవాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఇందులో హైదరాబాద్ నగర తాగునీటి అవసరాల కోసమే జూలై వరకు కనీసం 15 టీఎంసీలు తప్పనిసరిగా అవసరమవుతాయని, మరో 5 టీఎంసీల వరకు ఆవిరయ్యే అవకాశం ఉందని వివరించారు. ఈ క్రమంలో సాగర్ నీటిని కేవలం తాగునీటి అవసరాలు, కుడి, ఎడమ కాల్వల పరిధిలోని అవసరాలకే వినియోగించాలని తాము స్పష్టం చేశామన్నారు. కృష్ణా డెల్టాకు నాగార్జునసాగర్ నుంచి చుక్క నీరు కూడా ఇచ్చే పరిస్థితి లేదని తేల్చిచెప్పినట్లు వెల్లడించారు. హైదరాబాద్ తాగునీటి కోటా పోను మిగిలిన 25 టీఎంసీల వినియోగంపై మాత్రమే చర్చించాలని బోర్డుకు సూచించామన్నారు. ఏపీకి ఇప్పటికే పులిచింతలలో 42 టీఎంసీల నీరు ఉందని, పట్టిసీమ ద్వారా కూడా డెల్టాకు నీరు చేరుతోందని గుర్తుచేశారు.మరోవైపు ఏపీ ఇంజినీర్-ఇన్-చీఫ్ నరసింహమూర్తి మాట్లాడుతూ...

కృష్ణా డెల్టా అవసరాల కోసం నీటిని విడుదల చేయాల్సిందేనని తాము బోర్డు వద్ద గట్టిగా పట్టుబట్టామని తెలిపారు. డెల్టా తాగు, సాగునీటి అవసరాలపై 10 రోజుల క్రితమే కేఆర్ఎంబీకి అధికారికంగా లేఖలు కూడా రాసినట్లు పేర్కొన్నారు. ఇక పల్నాడు వాటర్ గ్రిడ్ అంశంపై ఈ భేటీలో ఎలాంటి చర్చ జరగలేదని ఆయన స్పష్టం చేశారు.ఇరు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో, త్వరలోనే నిర్వహించనున్న కేఆర్ఎంబీ పూర్తిస్థాయి బోర్డు సమావేశంలోనే కృష్ణా జలాల తాజా కేటాయింపులపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

తప్పు మీరు చేసి మాపై నిందలా?

మొదటిపేజీ తరువాయి

బోధి పెవిలియన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను బీఆర్ఎస్ ప్రభుత్వం దెబ్బతీసిందని ఆరోపించారు. ఇప్పుడు తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు.

గుంటూరుకు తాగునీరు అందించేందుకు తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, ఏపీ సీఎం జగన్ మధ్య ఒప్పందం జరిగిందని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. రూ.1,200 కోట్ల అంచనా వ్యయంతో జల్‌జీవన్ మిషన్ కింద ప్రాజెక్టు చేపట్టేందుకు 2022 ఫిబ్రవరి 16న ఉత్తర్వులు జారీ అయ్యాయని తెలిపారు. ఆ జీవో ఆధారంగానే పల్నాడు వాటర్‌గ్రిడ్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ విషయం తమ దృష్టికి వచ్చిన వెంటనే కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ), కేంద్ర ప్రభుత్వం, ఏపీ ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

ఏపీ ప్రాజెక్టులను చట్టబద్ధంగా అడ్డుకుంటాం

తెలంగాణ నీటి హక్కులకు భంగం కలిగించే ఏపీ ప్రాజెక్టులను చట్టబద్ధంగా అడ్డుకుంటామని సీఎం స్పష్టం చేశారు. నీటి వాటా కోసం ప్రధానిని రెండుసార్లు, కేంద్ర జలశక్తి మంత్రిని పలుమార్లు కలిసినట్లు తెలిపారు. కేఆర్ఎంబీతో పాటు సుప్రీంకోర్టులోనూ తెలంగాణ తరఫున బలంగా వాదనలు వినిపిస్తున్నామని చెప్పారు. బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ నుంచి ఆరు నుంచి ఎనిమిది నెలల్లో తీర్పు వచ్చేలా ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు.

కృష్ణా నదిలో మొత్తం 811 టీఎంసీల నీటి లభ్యత ఉండగా, ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయించేందుకు 2020 జనవరి 29న ఎందుకు అంగీకరించారని కేసీఆర్, హరీశ్‌రావును రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంపు విషయంలో గతంలో ఎందుకు అభ్యంతరం చెప్పలేదని నిలదీశారు. తెలంగాణలో ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, పాలమూరు-రంగారెడ్డి వంటి ప్రాజెక్టులు పూర్తికాకపోవడానికి గత ప్రభుత్వమే కారణమని ఆరోపించారు.

చుక్క నీరు వదులుకోం: ఉత్తమ్

కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోబోమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారనే అభ్యంతరాలతో పల్నాడు వాటర్‌గ్రిడ్‌పై కేఆర్ఎంబీ చైర్మన్, కేంద్ర ప్రభుత్వానికి, ఏపీ ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేపాల్‌అభివృద్ధికి రూ.15,000 కోట్లు

మొదటిపేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీ రూ.24,000 కోట్ల నేపాలీ రూపాయల (సుమారు రూ.15,000 కోట్లు) అభివృద్ధి ప్యాకేజీని అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం ఇరు దేశాల మధ్య సహకారానికి కొత్త అధ్యాయాన్ని లిఖించింది.నేపాల్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాక బాలేన్ షా భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "భారత్, నేపాల్ కేవలం పొరుగు దేశాలు మాత్రమే కాదు. మన బంధం విశ్వాసం, స్నేహంతో ముడిపడి ఉంది. కష్టసుఖాల్లో ఒకరికొకరం అండగా నిలుస్తాం" అని అన్నారు. నేపాల్ యువత ఆశలు, ఆకాంక్షలకు బాలేన్ షా నాయకత్వం నిదర్శనమని, ఆయన దార్శనికతను ప్రశంసించారు. రెండు దేశాల మధ్య రోడ్, రైల్, సరిహద్దు కనెక్టివిటీని మరింత పెంచాలని నిర్ణయించినట్లు మోదీ తెలిపారు. ఇటీవల నేపాల్‌ను అతలాకుతలం చేసిన వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆయన ప్రగాఢ



సంతాపం ప్రకటించారు.

ఈ సందర్భంగా నేపాల్ ప్రధాని బాలేన్ షా మాట్లాడుతూ.. భారత్ అందించిన ఆత్మీయ ఆతిథ్యానికి ధన్యవాదాలు తెలిపారు. "భారత్, నేపాల్ బంధం హిమాలయాలంత దృఢమైనది, సముద్రమంత విశాలమైనది. మన మధ్య ఉన్న సాన్నిహిత్యాన్ని మాటల్లో వర్ణించలేం. కష్టకాలంలో, ప్రకృతి వైపరీత్యాల సమయంలో భారత్ ఎల్లప్పుడూ మాకు అండగా నిలుస్తుంది. అందుకు భారత ప్రభుత్వానికి, ప్రజలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని అన్నారు. అనంతరం ఆయన ప్రధాని మోదీని నేపాల్ పర్యటనకు రావాల్సిందిగా ఆహ్వానించారు.ఈ సమావేశంలో భాగంగా ఇరు దేశాల మధ్య 8 కీలక అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) జరిగాయి. సివిల్ సర్వీస్ సామర్థ్య శిక్షణ, అంతరిక్ష పరిశోధన, ఆరోగ్యం, వైద్యం, పట్టణాభివృద్ధి, ఆయుర్వేదం, సాంప్రదాయ వైద్యం వంటి రంగాల్లో పరస్పర సహకారం కోసం ఈ ఒప్పందాలు కుదిరాయి. దీంతో పాటు ఇంధనం, కనెక్టివిటీకి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులను ఇరు దేశాల ప్రధానులు సంయుక్తంగా ప్రారంభించారు. కొన్ని కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన కూడా చేశారు. 'నైబర్‌హుడ్ ఫస్ట్' విధానంలో భాగంగా చమురు సరఫరాలో సవాళ్లు ఎదురైనప్పటికీ నేపాల్‌కు ఇంధనం, ఎరువులు, ఇతర నిత్యావసరాలను నిరంతరాయంగా అందించామని మోదీ గుర్తుచేశారు.

డేటా ఆధారిత నిర్ణయాలతోనే మెరుగైన ఫలితాలు

మొదటిపేజీ తరువాయి

అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ సమర్థ పనితీరుకు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలే నిదర్శనమని గుర్తుచేశారు.

ప్రభుత్వ శాఖలు ప్రజలకు అందించే వివిధ పౌర సేవలను మరింత సమర్థవంతంగా, వేగంగా చేరవేయడానికి తగిన కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సంతృప్తికరమైన సానుకూల అభిప్రాయం ఏర్పడినప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ ద్వారా ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులను ఏమాత్రం జాప్యం లేకుండా వేగంగా పరిష్కరించాలని సీఎం అధికారులకు తేల్చిచెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార ప్రక్రియలో పర్యవేక్షణ లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దుకోవాలని, ప్రతి శాఖ కూడా తన పనితీరును నిరంతరం సమీక్షించుకోవాలని ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, మైనారిటీ సంక్షేమ, ఆర్థిక, పురపాలక, ఇంధన శాఖల ఉన్నతాధికారులు మరియు ఆర్టీజీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సనాతనం అంటే ఆలయాలను కూల్చడమేనా?

మొదటిపేజీ తరువాయి

విమర్శలు చేశారు."హే రామ్! ఆలయాలను రక్షించండి! ఆంధ్రప్రదేశ్‌ను కాపాడండి!" అంటూ వైఎస్ జగన్ తన సందేశంలో పేర్కొన్నారు. కోట్ల మంది భక్తుల విశ్వాసాలకు ప్రతీకగా ఉన్న పురాతన అభయాంజనేయ స్వామి ఆలయాన్ని బుల్డోజర్లతో కూల్చివేయడం అత్యంత బాధాకరమని అన్నారు. గతంలో తిరుమల వెయ్యి కాళ్ల మండపం తొలగింపు, విజయవాడ కృష్ణా పుష్కరాల సమయంలో 40 ఆలయాల కూల్చివేత, బద్వేల్‌లోని కాశీనాయన జ్యోతి క్షేత్రం ధ్వంసం వంటి ఘటనలను ప్రస్తావిస్తూ, చంద్రబాబు హయాంలో ఎలాంటి ప్రత్యామ్నాయాలూ అన్వేషించకుండా పవిత్ర కట్టడాలను కూల్చివేసే ధోరణి కొనసాగుతోందని ఆరోపించారు.తమ ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా ఆలయాల నిర్మాణం, పునరుద్ధరణ కోసం 'శ్రీవాణి ట్రస్ట్'ను ఏర్పాటు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం చారిత్రక వారసత్వ సంపదను బుల్డోజర్లతో నేలమట్టం చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. సనాతన ధర్మాన్ని రక్షించడమంటే ఇదేనా అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.మరోవైపు, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి కూడా ఈ ఘటనపై తీవ్రస్థాయిలో స్పందించారు. జాతీయ రహదారి 716 విస్తరణ కోసం రోడ్డు మార్గాన్ని (అలైన్‌మెంట్) మార్చే అవకాశం ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఈ పురాతన ఆలయాన్ని కూల్చివేసిందని ఒక వీడియో ప్రకటనలో ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందూ ధర్మాన్ని కాపాడే విధానం ఇదేనా అని ఆయన నిలదీశారు.

మావోయిస్టుల పునరావాసం..

మొదటిపేజీ తరువాయి

2024 జనవరి 1 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో మొత్తం 824 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో తెలంగాణకు చెందిన వారు 59 మంది ఉండగా, ఛత్తీస్‌గఢ్ నుంచి 754 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 9 మంది, మహారాష్ట్ర, ఒడిశాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. లొంగిపోయిన వారిలో సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీ సభ్యులతో పాటు డివిజనల్, ఏరియా కమిటీ స్థాయి నాయకులు, పార్టీ సభ్యులు, మిలీషియా సిబ్బంది కూడా ఉన్నారు.

తాజా చెల్లింపులతో కలిపి ఇప్పటివరకు మొత్తం 659 మంది లబ్ధిదారులకు రూ.17.68 కోట్లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన 96 మంది అర్హులు తమ ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలను సమర్పించిన వెంటనే వారికి కూడా మంజూరైన ప్రోత్సాహకాలను విడుదల చేయనున్నారు.

ఏపీ నీళ్ల దోపిడీకి కాంగ్రెస్ సర్కార్ వత్తాసు

మొదటిపేజీ తరువాయి

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలోని బీఆర్ఎస్ నాయకుల బృందం సోమవారం హైదరాబాద్‌లోని జలసౌధలో కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చైర్మన్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. నాగార్జునసాగర్ నుంచి పల్నాడు ప్రాంతానికి నీటిని తరలించేందుకు ఏపీ ప్రభుత్వం చేపడుతున్న పనులను వెంటనే నిలిపివేయాలని కోరింది.సాగర్ జలాశయం డెడ్ స్టోరేజీ నుంచి సొరంగాల ద్వారా నీటిని అక్రమంగా తరలిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ పరిణామంతో నాగార్జునసాగర్ ఆయకట్టు రైతులతో పాటు హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాలకు ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.అనుమతులు, నీటి కేటాయింపులు లేకుండానే పల్నాడు వాటర్ గ్రిడ్ పనులు చేపడుతున్నారని, ఇవి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం2014 నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్, నీటి కేటాయింపులు, అనుమతులు, సాంకేతిక వివరాలను తెలంగాణకు అందించాలని డిమాండ్ చేశారు.గోదావరి జలాల్లోనూ ఏపీ తన వాటాకు మించి నీటిని వినియోగించుకుందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. తెలంగాణకు కేటాయించిన కృష్ణా జలాల వాటాకు ఎలాంటి నష్టం జరగకుండా కేఆర్ఎంబీ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

డిసెంబర్ 10న నల్లగొండలో భారీ సభ

ఏపీకి కృష్ణా జలాలను తరలించడాన్ని నిరసిస్తూ డిసెంబర్ 10న నల్లగొండలో లక్షలాది మంది రైతులతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రకటించారు. 'నల్లగొండ నగారా' పేరుతో నిర్వహించే ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు

డిసెంబర్ 7 నుంచి 9 వరకు గ్లోబల్ సమ్మిట్

మొదటిపేజీ తరువాయి

ఏర్పాటు చేస్తున్నారు. ఈ మెగా ఈవెంట్ ఏర్పాట్ల పురోగతిపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.సమ్మిట్ ప్రాంగణంలో వేదికలు, వివిధ సెక్టార్ల హాల్స్ నిర్మాణం, అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, కార్యక్రమాల నిర్వహణపై అధికారులకు సీఎం పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, స్టార్టప్ పెవిలియన్, ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్ ఎక్స్‌పో, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రదర్శన, తెలంగాణ పెవిలియన్, ఎడ్యుకేషన్ ఎక్స్‌పో, క్లైమేట్ కాంక్లేవ్‌లను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. దాదాపు వెయ్యికి పైగా ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా ప్రవేశం కల్పించాలని తెలిపారు. అలాగే విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ప్రతినిధులతో ఎంతో మర్యాదగా వ్యవహరించేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని స్పష్టం చేశారుఈ అంతర్జాతీయ సదస్సులో తెలంగాణ చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. కాకతీయుల శిల్పకళ, సమ్మక్క సారలమ్మ ఆలయ తోరణాల నమూనాలు, సోమశిల ఆలయం, నిర్మల్ పెయింటింగ్స్, భౌగోళిక గుర్తింపు (జీఐ) పొందిన ఉత్పత్తులు, చేనేత కళా వైభవాన్ని ప్రతిబింబించేలా స్టాల్లను తీర్చిదిద్దాలని చెప్పారు. రాష్ట్ర ప్రగతితో పాటు భవిష్యత్ ప్రాజెక్టు అయిన 'గాంధీ సరోవర్' ప్రణాళికలను కూడా ఇక్కడ ప్రదర్శించనున్నారు.

డిసెంబర్ 7న ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే సందర్భంగా రక్షా ఎక్స్‌పోలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలతో పాటు ఎయిర్ షో నిర్వహించనున్నారు. ఈ వైమానిక ప్రదర్శనను వీక్షించేందుకు ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. మరోవైపు క్లైమేట్ కాంక్లేవ్‌లో సద్గురు జగ్గీ వాసుదేవ్, ఐక్యరాజ్యసమితి ప్రతినిధులు, అంతర్జాతీయ స్థాయి నిపుణులు ప్రసంగించనున్నారు. గ్రీన్ ఎకానమీపై రౌండ్ టేబుల్ సమావేశంతో పాటు ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు, స్టార్టప్‌లు ఇందులో భాగస్వామ్యం కానున్నాయి.

ఎడ్యుకేషన్ కాంక్లేవ్‌లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంతో పాటు యూకే, యూరోపియన్ పెవిలియన్లను ఏర్పాటు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న ఐఎస్‌బీ, ఐఐటీ హైదరాబాద్, నల్సార్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రతినిధులు విదేశీ నిపుణులతో చర్చలు జరపనున్నారు.

డిసెంబర్ 7న 'స్కూల్స్ ఆఫ్ ది ఫ్యూచర్', 8న 'విద్యాసంస్థల్లో సంస్కరణలు' అనే అంశాలపై జరిగే ప్రత్యేక చర్చల్లో ముఖ్యమంత్రి స్వయంగా పాల్గొంటారు. మీడియా, గేమింగ్ రంగానికి చెందిన 'ఇండియా జాయ్ 2026' వేదికపై అడోబ్, సోనీ, ఉబిసాఫ్ట్ వంటి సుమారు 150 ఏవీజీసీ కంపెనీలు తమ ప్రదర్శనలను ఇవ్వనున్నాయి.

ముఖ్యమైన అంతర్జాతీయ ప్రతినిధులతో పాటు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఈ సమ్మిట్‌కు ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆహ్వానాల ప్రక్రియ బాధ్యతలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబులకు అప్పగించారు. ఈ సమీక్షా సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కు ఎటిఎంలా రేవంత్ రెడ్డి

కరీంనగర్‌లో నితిన్ నబీన్ మహా పాదయాత్ర.. కాంగ్రెస్‌పై నిప్పులు

కరీంనగర్, నవంబర్ 23,(ప్రజావినికిడి):

తెలంగాణ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ తన దూకుడు పెంచింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కరీంనగర్‌లో నిర్వహించిన మహా పాదయాత్రలో పాల్గొన్నారు. 'లోకతంత్ర బచావో.. అరాచకత హటావో' (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. అరాచకాన్ని అంతం చేయండి) నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీజేపీ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. నగరంలోని ప్రధాన రహదారులు కాషాయ జెండాలు, బ్యానర్లు, ప్లెక్సీలతో సందడిగా మారాయి.

వైశ్యభవన్ సమీపంలో ప్రారంభమైన పాదయాత్ర టవర్ సర్కిల్, శాస్త్రి రోడ్డు మీదుగా కరీంనగర్ కమాన్ చౌరస్తా వరకు సాగింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు సహా పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పాదయాత్ర అనంతరం నిర్వహించిన సభలో నితిన్ నబీన్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ప్రారంభమైందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని నితిన్ నబీన్ విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన ముఖ్యమంత్రి ఢిల్లీ



పర్యటనలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రయోజనాల కంటే కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని వ్యాఖ్యానించారు.

యువత, రైతులు, మహిళలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ప్రజల ఆకాంక్షలను విస్మరించి పాలన సాగిస్తోందని విమర్శించారు.

రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థపై అనవసర విమర్శలు చేస్తున్నారని నితిన్ నబీన్ ఆరోపించారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకోవడం మాత్రమే కాదని, దాని స్ఫూర్తిని గౌరవించాలని హితవు పలికారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్య హక్కులను అణచివేసిందని గుర్తుచేశారు. అలాంటి కాంగ్రెస్ ఇప్పుడు ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాల విమర్శలకు కౌంటర్

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను నితిన్ నబీన్ తప్పుబట్టారు. మరణించిన వారి పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగాలా? వలస వెళ్లిన వారు ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలా? అని ప్రశ్నించారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండటం ప్రజాస్వామ్యానికి అవసరమని పేర్కొన్నారు.


మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ఆర్థికంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని నితిన్ నబీన్ అన్నారు. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా పేదలకు నేరుగా ప్రయోజనాలు అందుతున్నాయని వివరించారు. డ్రగ్స్ రహిత భారత్, వికసిత భారత్ లక్ష్యాల సాధనకు యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

2028లో తెలంగాణలో బీజేపీదే అధికారం

బీజేపీ కార్యకర్తలు గ్రామగ్రామాన పర్యటించి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని నితిన్ నబీన్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీని బలోపేతం చేసి 2028 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి తీసుకురావాలని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన శివాజీ



షాద్‌నగర్,(ప్రజావినికిడి):
పట్టణ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన శివాజీ, షాద్‌నగర్ ఎమ్మెల్యే,ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి తన ఎన్నికకు సంబంధించిన విషయాలను తెలియజేశారు. నూతనంగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన శివాజీని ఎమ్మెల్యే అభినందించారు.రియల్ ఎస్టేట్ రంగంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి,పట్టణ అభివృద్ధికి అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, కౌన్సిలర్ సి. పెంటయ్య,చందు లాల్,కత్తి చంద్రశేఖరప్ప,మాధవలు యాదవ్,అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి



షాద్ నగర్,(ప్రజావినికిడి):
బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి,తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ శ్రీ సునీల్ బన్సల్ బీజేపీ నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాబోయే2027 హైదరాబాద్,రంగారెడ్డి,మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలు, పట్టభద్రుల సమస్యలు,ఎన్నికల వ్యూహాలతో పాటు యాదాద్రి భువనగిరి,జిల్లాల్లోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఇరువురూ చర్చించారు.అలాగే పార్టీ బలోపేతం,ప్రజా సమస్యల పరిష్కారం,రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

రెండవ రోజు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు

42 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన వైద్య సిబ్బంది



షాద్ నగర్,(ప్రజావినికిడి):పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా రెండో రోజు వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ తొలిరోజు పోలియో చుక్కలు వేసుకోలేకపోయిన చిన్నారులకు చుక్కలు వేస్తున్నారు.ఇందులో భాగంగా షాద్‌నగర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో మొబైల్ వైద్య బృందం ప్రత్యేకంగా పర్యటించి చిన్నారులకు పోలియో చుక్కలు వేసింది.హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు భారతి,శిరీష సిండికేట్ కాలనీలోని గుడిసెలు, భగీరథ కాలనీలో నిర్మాణ పనుల సమీపంలోని నివాసాలు,రైతు కాలనీలోని గుడిసెలతో పాటు తెలంగాణ ప్రభుత్వం పేదలకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోని అన్ని బ్లాకుల్లో పర్యటించారు.ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ రెండో రోజు నిర్వహించిన ఇంటింటి కార్యక్రమంలో మొత్తం 42 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు.

జానంపేట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తహసీల్దార్ నాగయ్య

శాలువాతో ఘనంగా సత్కరించిన ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు





షాద్‌నగర్,(ప్రజావినికిడి):
పట్టణంలోని జానంపేట శ్రీ శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఫరూక్‌నగర్ తహసీల్దార్ నాగయ్య పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి విచ్చేసిన తహసీల్దార్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.ప్రత్యేక పూజలతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణంనెలకొంది.ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త,షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు తహసీల్దార్ నాగయ్యను శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో తహసీల్దార్ నాగయ్య మొక్కలు నాటి నీరు పోశారు.ఈ కార్యక్రమంలో ఒగ్గు కిషోర్, రాంభూపాల్,జర్నలిస్ట్ రమేష్,బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





షాద్ నగర్,(ప్రజావినికిడి): నియోజకవర్గంలోని కేశంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ శ్రీ వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,కరోనా సమయంలో ప్రపంచం మొత్తంఅతలాకుతలమైనప్పటికీ, ప్రజలందరం ఏకతాటిపై నిలబడి సమిష్టిగా కరోనాను ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావాన్ని కూడా సమర్థవంతంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.ఎల్‌నినో ప్రభావం కారణంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. సర్వసభ్య సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలపై సమావేశంలో సమగ్రంగా చర్చించి,వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.గత సర్వసభ్య సమావేశంలో చర్చించిన సమస్యల్లో దాదాపు 70 శాతం పరిష్కరించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. మిగిలిన సమస్యలను కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
గ్రామాల అభివృద్ధి,
ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు.గత ప్రభుత్వ హయాంలో అర్హులైన పేదలకు రేషన్ కార్డులు,ఇళ్లు,పెన్షన్లు అందించడంలో నిర్లక్ష్యం జరిగిందని,ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అర్హులైన పేదలను గుర్తించి ఆయా పథకాల ద్వారా ఆదుకుంటోందని పేర్కొన్నారు. గతంలో భూమి ఉన్న రైతులకు మాత్రమే రైతు బీమా వర్తించేదని,నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతి కుటుంబ యజమానికి ఒక్క రూపాయి ప్రీమియం కూడా చెల్లించకుండా రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయడం గొప్ప విషయమని ఎమ్మెల్యే అన్నారు.పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి,ఎంపీడీవో,వ్యవసాయ శాఖ ఏడీ రమాదేవి,వివిధ శాఖల అధికారులు,సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాత్కు శ్రీనివాస్ యాదవ్ నియామకం

యువత సమస్యలపై నిరంతరం పోరాడుతా..

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: బాత్కు శ్రీనివాస్ యాదవ్



శంషాబాద్, (ప్రజావినికిడి): నవంబర్ 23, భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాత్కు శ్రీనివాస్ యాదవ్ నియమితులయ్యారు.ఈ మేరకు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండె గణేష్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా బాత్కు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, తనకు ఈ అవకాశం కల్పించిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండె గణేష్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్, మాజీ బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు, మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి నేవూరి మధుసూదన్‌తో పాటు శంషాబాద్ బీజేపీ,బీజేవైఎం నాయకులు, డివిజన్ అధ్యక్షులకు ధన్యవాదాలు తెలిపారు.తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను గౌరవంగా స్వీకరిస్తున్నానని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి యువత సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. బీజేవైఎం బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. నాయకులు తనపై ఉంచిన నమ్మకమే తనకు బలమని,వారి ఆశీర్వాదంతో ముందుకు సాగుతానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్, గణేష్ బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, మేడ్చల్ జిల్లా ఇంచార్జి మల్లా రెడ్డి, శంషాబాద్ జోన్ బీజేపీ అధ్యక్షుడు వంశీ వివేకానంద యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ అధికారులకు జర్నలిస్టులు అంటే చులకనా.?

అవినీతి, అక్రమాల గురించి జర్నలిస్టులు వార్తలు రాస్తే స్పందించని అధికారులు.?

సామాజిక కార్యకర్త, మానవ హక్కుల బాధ్యులు హెచ్ఆర్ఎఫ్, జాతీయ ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత బాపట్ల కృష్ణమోహన్



హైదరాబాద్,(ప్రజావినికిడి):నవంబర్ 23:
అవినీతి, అక్రమాల గురించి మీడియాలో వార్తా కథనాలు వచ్చినా అధికారులు ఎందుకు స్పందించడం లేదు? ఇలాంటి సందర్భాల్లో జర్నలిస్టులు చట్టపరమైన చర్యల కోసం, అంటే చట్టాలను ఉల్లంఘించిన అధికారులపై న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. పరిపాలనాపరమైన చర్యల కోసం, అంటే ప్రభుత్వ విధానాలు, నియమాలను అమలు చేయని అధికారుల గురించి జర్నలిస్టులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదు. ప్రభుత్వ అధికారిక సోషల్ మీడియా మాధ్యమాలైన ఎక్స్ ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఈమెయిల్, ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేస్తున్నా అధికారులు స్పందించడం లేదు.ప్రస్తుతం కేంద్ర అదేవిదంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించడానికి డిజిటల్ మాధ్యమాలను విస్తృతంగా ఉపయోగిస్తున్నాయి.ముఖ్యంగా జర్నలిస్టులు నిత్యం జీహెచ్ఎంసీ మరియు హెచ్ఎండీఏ పరిధిలో జరుగుతున్న అవినీతి అక్రమాల గురించి వార్త కథనాల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తున్నా స్పందన లేదు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి "అవినీతి అంతం రేవంత్ రెడ్డి పంతం" అంటారు

కానీ అధికారులు మాత్రం తమ ఇష్టం వచ్చినట్లు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారు.కేవలం వార్తా కథనాల ఆధారంగానే కాకుండా, కొందరు జర్నలిస్టులు అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా స్పందన సరిగా ఉండటం లేదు.కొన్ని సందర్భాల్లో రాజకీయ ఒత్తిళ్ల వల్ల కూడా అధికారులు స్పందించడం లేదని అర్థమవుతుంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులకు స్థానిక నాయకులు లేదా ఉన్నత స్థాయి వ్యక్తుల అండదండలు ఉన్నప్పుడు, అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నారు.కొన్నిసార్లు సంబంధిత శాఖలోని అధికారులకు కూడా ఆ అక్రమాల్లో భాగస్వామ్యం ఉండటం వల్ల ఫైళ్లను దీర్ఘకాలంగా తొక్కిపెడుతున్నారు.వార్తలు రాసినా అధికారుల్లో కదలిక లేకపోతే, ఆ విషయాన్ని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి, వార్తా కథనం కటింగ్‌తో పాటు ఆధారాలను జతచేసి, సంబంధిత శాఖ ఉన్నతాధికారికి ఉదాహరణకు జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ లేదా శాఖాధిపతికి నేరుగా ఫిర్యాదు చేసినా స్పందన ఉండటం లేదు. ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ సెల్, ప్రజావాణి కార్యక్రమంలో నేరుగా ఫిర్యాదు చేసినా అధికారులు ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదు. ప్రజావాణిలో ఇచ్చిన పిటిషన్లను గడువులోగా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది,కానీ అలా పరిష్కారం కాని ఫిర్యాదులు వందల్లో ఉన్నాయి.
వార్తా కథనం వచ్చిన తర్వాత అధికారులు స్పందించకపోతే, లేదా ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన తర్వాత అధికారులు ఏ చర్యలు తీసుకున్నారో తెలుసుకోవడానికి సమాచార హక్కు చట్టం ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేసుకుంటే, చాలా సందర్భాల్లో "మీరు అడిగిన సమాచారం మా కార్యాలయంలో అందుబాటులో లేదు"అనే సమాధానమే వస్తోంది. "ఫలానా తేదీన ప్రచురితమైన వార్తపై ఇచ్చిన ఫిర్యాదుపై తీసుకున్న చర్యల వివరాలు ఇవ్వండి" అని అడిగినా సరైన స్పందన ఉండదు.జర్నలిస్టులు రాసిన అవినీతి, అక్రమాల వార్తా కథనాలకు ప్రభుత్వ ఉద్యోగులు స్పందించకపోతే, అవినీతి నిరోధక శాఖ,ఏసీబీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదు,ఇది నిజం. ప్రభుత్వ అధికారులు తమ విధులను నిర్వర్తించడంలో విఫలమైనప్పుడు తెలంగాణ హై కోర్ట్‌ను,లోకాయుక్తను,మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన సందర్భాల్లో, లోకాయుక్త స్వతంత్ర సంస్థ కాబట్టి అధికారులకు నోటీసులు జారీ చేసి విచారణ జరుపుతుంది.ఆ సమయంలో ప్రభుత్వ అధికారులు గౌరవ న్యాయస్థానాలకు తప్పుడు నివేదికలు ఇచ్చి, సంవత్సరాల తరబడి కేసులను పెండింగ్‌లో పెడుతున్నారు.
ప్రజాధనం పెద్ద ఎత్తున దుర్వినియోగం అవుతున్నా, వ్యవస్థ మొత్తం నిర్లక్ష్యం వహిస్తున్నా, తగిన ఆధారాలతో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం పిల్ వేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

మృత్యువుతో పోరాడి కోలుకున్న 65 ఏళ్ల మహిళ

విఏ-ఈ.సీ.ఎం.ఒ.సాయంతో క్లిష్టమైన గుండె చికిత్స విజయవంతం: డాక్టర్ దామోదర్ రెడ్డి

శంషాబాద్, (ప్రజావినికిడి): నవంబర్ 23



తీవ్ర గుండెపోటుతో పాటు కార్డియోజెనిక్ షాక్‌కు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న 65 ఏళ్ల మహిళకు అత్యాధునిక వైద్య చికిత్స అందించి ప్రాణాలు కాపాడినట్లు హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ దామోదర్ రెడ్డి వెల్లడించారు. శంషాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ చికిత్సకు సంబంధించిన వివరాలను ఆయన వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళ ఆసుపత్రికి వచ్చిన సమయంలో రక్తపోటు ప్రమాదకర స్థాయికి పడిపోయిందని, గుండె రక్తాన్ని పంప్ చేసే సామర్థ్యం కూడా తీవ్రంగా తగ్గిపోయిందని తెలిపారు.వైద్య పరీక్షల్లో గుండెకు రక్తాన్ని సరఫరా చేసే మూడు ప్రధాన రక్తనాళాల్లో తీవ్రమైన బ్లాకేజీలు గుర్తించినట్లు చెప్పారు. ముఖ్యంగా లెఫ్ట్ మెయిన్ కరోనరీ ఆర్టరీలో అడ్డంకి ఉండటంతో చికిత్స అత్యంత సవాలుగా మారిందన్నారు. రోగి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని విఏ-ఈ.సీ.ఎం.ఒ.అనే అత్యాధునిక వైద్య సాంకేతికత సహాయంతో ప్రొటెక్టెడ్ పీసీఐ చికిత్స చేపట్టినట్లు తెలిపారు.ఈ చికిత్సలో మూడు స్టెంట్లను అమర్చి గుండె రక్తనాళాల్లో రక్తప్రసరణను పునరుద్ధరించామని వివరించారు. చికిత్స అనంతరం 24 గంటల పాటు విఏ-ఈ.సీ.ఎం.ఒ.సపోర్టు అందించి,ఆ తర్వాత తొలగించినట్లు పేర్కొన్నారు. చికిత్సకు రోగి మంచి స్పందన చూపారని,రెండో రోజున వెంటిలేటర్ తొలగించగా, మూడో రోజున ఐసీయూ నుంచి సాధారణ వార్డుకు తరలించినట్లు తెలిపారు.గుండె పనితీరులోనూ గణనీయమైన మెరుగుదల నమోదైందన్నారుఅత్యంత క్లిష్టమైన గుండెపోటు పరిస్థితుల్లో అధునాతన వైద్య సాంకేతికత, సమన్వయంతో కూడిన వైద్య బృందం కృషి కీలకంగా పనిచేస్తాయని డాక్టర్ దామోదర్ రెడ్డి పేర్కొన్నారు. గుండెపోటు లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

హిమాయత్‌సాగర్ సమీపంలో ఎంఐఎం నేత హత్య

మూర్తుజ అలీపై కత్తులతో దాడి.. - ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి





రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): నవంబర్ 23, ఎంఐఎం నాయకుడు మూర్తుజ అలీ అలియాస్ మూర్తుజ పైల్వాన్ దారుణ హత్యకు గురయ్యారు. గుర్తుతెలియని దుండగులు కత్తులతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. సోమవారం సాయంత్రం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హిమాయత్‌సాగర్ ఎకో పార్కు సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దుండగుల దాడిలో తీవ్రంగా గాయపడిన మూర్తుజ అలీని వెంటనే అత్తాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. రాజేంద్రనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న మూర్తుజ అలీకి ఎంఐఎం నాయకుడిగా గుర్తింపు ఉంది. ఈ హత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.పాత కక్షలా.? ఆర్థిక లావాదేవీల వివాదమా.? అనే కోణాల్లో విచారణ జరుపుతున్నారు. నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

.. ఇన్‌స్పెక్టర్ వై. సురేందర్ రెడ్డి

పాలమాకుల జెడ్పీహెచ్ఎస్‌లో పెద్దషాపూర్ పోలీసుల అవగాహన కార్యక్రమం

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి..

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

శంషాబాద్, (ప్రజావినికిడి): నవంబర్ 23,






విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని పెద్దషాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వై. సురేందర్ రెడ్డి సూచించారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దషాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం పాలమాకుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, రోడ్డు భద్రత, బాలల రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వై. సురేందర్ రెడ్డి మాట్లాడుతూ,
వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ వంటి సామాజిక మాధ్యమాలను ఉపయోగించేటప్పుడు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితుల ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను అంగీకరించవద్దని,గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత ఫొటోలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో వేధింపులు లేదా అనుమానాస్పద సందేశాలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. గంజాయి,ఇతర మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని,డ్రగ్స్ వినియోగం ఆరోగ్యం, చదువు, కుటుంబం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించాలని, మైనర్లు వాహనాలు నడపకూడదని సూచించారు. అలాగే బాలల భద్రత,వేధింపుల నివారణ,పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 112, సైబర్ మోసాలపై 1930 హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పెద్దషాపూర్ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు డి.బాలరాజు, సి.రాఘవేందర్ పాల్గొన్నారు. విద్యార్థులు అవగాహన కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు తెలియజేస్తూ సమాజంలో చైతన్యం తీసుకురావాలని పోలీసులు కోరారు.

మేజర్ గ్రామ పంచాయతీకి కార్యదర్శిని నియమించండి

ప్రజావాణిలో వినతి



వాజేడు,నవంబర్ 24,(ప్రజావినికిడి):మేజర్ గ్రామ పంచాయతీకి కార్యదర్శిని నియించాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ నాయకులు ప్రజావాణిలో ఇంచార్జీ వ్యవహరించిన ఎంఈవో జీవి సత్యనారాయణకి వినతి పత్రము అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి దొర మాట్లాడుతూ, వెంకటాపురం మేజర్ పంచాయతీకి కార్యదర్శి లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, గ్రామపంచాయతీ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడిలాగే ఉందని ఆయన అన్నారు.మేజర్ పంచాయతీకి ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న కార్యదర్శి 1/70 ఎల్.టి.ఆర్ చట్టానికి విరుద్ధంగా వలస గిరిజనేతరుల అక్రమ కట్టడాలకు ఇంటి పన్నులు ఇస్తూ ఏజెన్సీ చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. స్థానిక ఆదివాసులకు ఇంటి పన్నుల మంజూరు విషయంలో కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ, వలస గిరిజనేతరులకు కొమ్ముకాస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు.
చేశారు.మేజర్ పంచాయతీకి ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న కార్యదర్శి వీధుల పై ఉన్నత అధికారులు పరిశీలన చేయాలని కోరారు.ఏజెన్సీ ప్రాంతమైన వెంకటాపురం మండల కేంద్రంగా వలస గిరిజనేతరుల అక్రమ నిర్మాణాల పై దృష్టి సాధించి, అలాగే వారి ఇంటి పన్నులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.వెంకటాపురం ప్రజల సమస్యలు దృష్టిలో పెట్టుకొని ఉన్నత అధికారులు వెంటనే ఒక రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ మండల విద్యార్థి విభాగం నాయకులు పూనెం నితిన్ ఉన్నారు.

వాజేడు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించిన ఆదివాసీ నవనిర్మాణ సేనా

1/70 అమలు చేయాలి..

జిఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి

ఆదివాసీల పై అణచితను ఉపేక్షించేది లేదు..

ఎస్పీ జిల్లా అధ్యక్షులు పర్సిక సతీష్

వాజేడు,నవంబర్ 24,(ప్రజావినికిడి):



ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీల అస్థిత్వం ప్రమాదం పడిందని, హక్కులు అమలుకు నోచుకోవడం లేదని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి ఆరోపించారు.
ఏఎన్ఎస్ ఆధ్వర్యంలో వాజేడు మండల కేంద్రం లో సోమవారం ధర్నా నిర్వహించారు. ముందుకు కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్ కు పలు సమస్యలతో కూడిన వినపత్రం అందజేశారు.ఈ ర్యాలీకి జి ఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి,ఏ ఎస్పీ జిల్లా అధ్యక్షులు పర్సిక సతీష్ మద్దతు తెలిపారు. అనంతరం నర్సింహా మూర్తి మాట్లాడుతూ, రాజ్యాంగ బద్దంగా ఏర్పడిన ఐదో షెడ్యూల్ పరిపాలన కొనసాగించాలని గవర్నర్ ని కోరినారు. రాజ్యాంగం లో ఆర్టికల్ 244(1) ప్రకారం ఏర్పాటు అయిన ఐదో షెడ్యూల్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురి అవుతున్నట్టు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రెండు లక్షల ఎకరాల్లో షెడ్యూల్ ప్రాంతంలో ఖనిజ నిక్షేపాలు తీస్తున్నట్టు ఆయన తెలిపారు.ఈ దేశ బడ్జెట్ లో 60 శాతం ఐదు ఆరు షెడ్యూల్ ప్రాంతాల నుండి ఆదాయం ప్రభుత్వానికి పోతోందని పేర్కొన్నారు. 26-27 బడ్జెట్ లో కేంద్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం 1,39,389 కోట్ల రూపాయలు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం 9,739 కోట్ల రూపాయలు బడ్జెట్ లో కేటాయించినరాని అన్నారు. కనీసం 50 శాతం నిధులు కూడా ఆదివాసీల సంక్షేమం కోసం ఖర్చు చేయడం లేదని కాగ్ నివేదిక లో పేర్కొన్నట్టు నర్సింహా మూర్తి వివరించారు. రాష్ట్ర కార్య నిర్వహన అధ్యక్షులు వాసం నాగరాజు మాట్లాడుతూ, దేశానికీ స్వతంత్రం వచ్చి ఎనభై ఏళ్ళు అవుతున్న పెనుగోలు, పెనుగోలు కాలనీ గ్రామాల ఆదివాసీలకు ఇంటిపన్నులు జారీ చేయకపోవడం తో రెవిన్యూ, మండల పరిషత్ అధికారుల పైన ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎనభై ఏళ్ళు అయినా ఆదివాసీలు ఎటువంటి మౌలిక వసతులు లేక చీకట్లో మగ్గుతున్నట్టు ఆయన తెలిపారు. పెనుగోలు గుట్టల మధ్య ఉన్న ఆదివాసీలకు రోడ్డు మార్గం లేదన్నారు. దశాబ్దాలు గా ఆదివాసీలు విద్య వైద్యం అందక నష్టపోతున్నట్టు ఆయన తెలిపారు. వందల ఏళ్లుగా తమ సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే పట్టాలు, ఇంటిపన్నులు ఇవ్వాలని,విద్యుత్ మీటర్లు కూడా మంజూరు చేయాలనీ అన్నారు.1/70 చట్టం నేటికీ అమలుకు నోచుకోవడం లేదని జి ఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి అన్నారు. ఎల్ టి ఆర్ చట్టాన్ని అమలు చేయకుండా అక్రమంగా గిరిజనేతరులకు పట్టాలు చేస్తున్న రెవిన్యూ అధికారుల పైన మండిపడ్డారు. ఏ ఎన్ ఎస్ చేసే ప్రతి పోరాటానికి తన మద్దతు ఉంటుందని అన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు పర్సిక సతీష్ మాట్లాడుతూ, హక్కులు చట్టాలు అమలు చేయాలి అని అడిగితె ఉద్యమకారుల పైన అక్రమ కేసులు బనాయిస్తే ఊరుకునేది లేదని అన్నారు. రాజకీయ పార్టీలు ఆదివాసీల పైన అణచివేత కొనసాగిస్తున్నట్టు ఆయన తెలిపారు.ఎవర్ని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఏ ఎన్ ఎస్ జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్, సోషల్ మీడియా అధికార ప్రతినిధి పాయం అజయ్, మోడెం నాగరాజు మాట్లాడుతూ, ఆదివాసీ చట్టాలను అమలు చేయాలనీ, వాటిని అమలు చేసేదాకా అలుపెరుగని పోరాటం చేస్తామని అన్నారు. పెనుగోలు ఆదివాసీ గ్రామానికి ఈ ప్రపంచ పటం లో చోటు కల్పించమని, ఆదివాసీలు ఉన్నారనే వాస్తవాన్ని ప్రభుత్వం గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరినారు.ఈ కార్యక్రమం లో నాయకులు పూనెం ప్రతాప్, కుంజ మహేష్, వాసం నారాయణ తల్లాడి ప్రసాద్, మనోజ్,తొర్రిం సంతోష్,సోషల్ మీడియా ప్రతినిధి సంతోష్, కంతి శంకర్, తల్లాడి నానీబాబు, కార్తీక్,రవిరాజు ప్రజలు పాల్గొన్నారు.



పట్టాభూమిలో హైడ్రా వేసిన ఫెన్సింగ్ ను వెంటనే తొలగించాలి..

బాలగొని కుటుంబ సభ్యులు





ఘట్కేసర్,(ప్రజావినికిడి):

మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలం అన్నోజిగూడ లో తమ తాతల కాలం నాటి నుండి సాగుచేస్తున్న తమ పొలంలో హైడ్రా అధికారులు ఫెన్సింగ్ వెయ్యడం అన్యాయమని అన్నోజిగూడ కు చెందిన బాలగోని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అన్నోజిగూడ సర్వే నెంబర్ 87 లోని నాలుగు ఎకరాల ఇరవై గుంటల స్థలంలోని మీర్ఖాన్ కుంట చుట్టూ హైడ్రా అధికారులు హద్దులు నాటి ఫెన్సింగ్ వేశారు. దీంతో అధికారుల తీరు పై బాలాగోని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,
1944 సంవత్సరంలో సర్వే నంబర్లు 52,53 లలో బాలగోని రాజయ్య నిజాం పాలకుల నుండి అన్నోజిగూడ గ్రామ పరిధిలో పదహారు ఎకరాల రెండు గుంటల పట్టా స్థలం కొనుగోలు చేశారని అన్నారు.1954 తర్వాత చేసిన రీ సర్వే అనంతరం సర్వే నంబర్లు 88,89, 90,91,92 లుగా మారిపోయాయని అన్నారు. అప్పటినుండి ఆ స్థలంలో తమ తండ్రులు,తాము సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని అన్నారు. సంస్కృతి టౌన్ షిప్,పరిసర ప్రాంతాల అపార్టుమెంటుల నుండి వచ్చిన డ్రైనేజీ నీటి తో మీర్ఖాన్ కుంట నిండి తమ పొలంలోకి రావడం వల్ల తమ పొలాన్ని కూడా అధికారులు ఎఫ్టిఎల్ గా భావించి ఫెన్సింగ్ వేశారని అన్నారు. అధికారులను ఇదేమని అడిగితే పట్టించుకోవడం లేదనీ,హైడ్రా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలని అనడం బాధాకరమని అన్నారు. తమకు చెందిన దాదాపు రెండు ఎకరాల పట్టా స్థలంలో హైడ్రా అధికారులు వేసిన ఫెన్సింగ్ వెంటనే తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో భూమి పట్టాదారులు బాలగోని ఆంజనేయులు గౌడ్,బాలగోని శంకరయ్య గౌడ్, బాలగోని రమేష్ గౌడ్,బాలగోని సుధాకర్ గౌడ్, బాలగోని విజయ్ గౌడ్,బాలగోని మధుసూదన్ గౌడ్, బాలగోని ప్రవీణ్ గౌడ్, బాలగోని వినోద్ గౌడ్,బాలగోని నవీన్ గౌడ్, బాలగోని కార్తీక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

వెస్ట్ బెంగాల్ పేరు మార్పునకు రంగం సిద్ధం

వెస్ట్ బెంగాల్ పేరును పశ్చిమ్ బంగాగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం

డిసెంబర్ 9న అసెంబ్లీలో అధికారికంగా తీర్మానం ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

జాతీయ సదస్సుల్లో ప్రాధాన్యత దక్కేందుకే అక్షర క్రమం మార్పు

నవంబర్ 23,(ప్రజావినికిడి):



పశ్చిమ బెంగాల్ రాష్ట్రం పేరును మార్చేందుకు అక్కడి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాష్ట్ర ఆంగ్ల నామమైన 'వెస్ట్ బెంగాల్' స్థానంలో బెంగాలీ పేరైన 'పశ్చిమ్ బంగా'ను అధికారికంగా ఖరారు చేసే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ మేరకు డిసెంబర్ 9న అసెంబ్లీలో అధికారిక తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు ముఖ్యమంత్రి సువేందు అధికారి వెల్లడించారు.కోల్‌కతాలోని సచివాలయంలో జరిగిన కేబినెట్ భేటీ అనంతరం సీఎం వివరాలు వెల్లడించారు. "ఇకపై ఆంగ్లంలో కూడా రాష్ట్రాన్ని 'పశ్చిమ్ బంగా' అనే పిలుస్తారు. దీనికి సంబంధించిన తీర్మానాన్ని డిసెంబర్ 9న అసెంబ్లీలో ప్రవేశపెడతాం. సభ ఆమోదం పొందిన తర్వాత పార్లమెంటరీ, చట్టపరమైన ప్రక్రియల కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపుతాం" అని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ పేరు మార్పు వెనుక బలమైన పాలనాపరమైన కారణం కూడా ఉంది. ప్రస్తుత పేరు ఆంగ్ల అక్షరమాల ప్రకారం W (West Bengal)తో ప్రారంభమవుతోంది. దీనివల్ల జాతీయ స్థాయి సమావేశాలు, ముఖ్యమంత్రుల సదస్సులలో బెంగాల్ ప్రతినిధులకు చివరి వరుసలో మాట్లాడే అవకాశం వస్తోంది. దీనివల్ల సమయం సరిపోక రాష్ట్ర వాణిని బలంగా వినిపించలేకపోతున్నారు. ఈ సమస్యను అధిగమించి, ఆల్ఫాబెటికల్ జాబితాలో ముందు వరుసలోకి వచ్చేలా Pతో మొదలయ్యేలా 'పశ్చిమ బంగా' పేరును ఖరారు చేశారు. అసెంబ్లీలో తీర్మానం ఆమోదం పొందిన అనంతరం, రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్ సవరణ కోసం కేంద్ర ఆమోదానికి పంపనున్నారు

సికింద్రాబాద్ నుంచి కాశీ, అయోధ్యలకు 'భారత్ గౌరవ్' రైలు..

తెలంగాణ, ఏపీలో ఆగే స్టేషన్లు ఇవే!

నవంబర్ 23,(ప్రజావినికిడి):

భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ పర్యాటకులు, భక్తుల కోసం మరో ప్రత్యేక ఆధ్యాత్మిక యాత్రను అందుబాటులోకి తీసుకువచ్చింది. 'వారణాసిఅయోధ్య పుణ్యక్షేత్ర యాత్ర' పేరిట భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ రైలు 2026 డిసెంబర్ 5వ తేదీన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరనుంది.

యాత్ర కాలవ్యవధి, సీట్ల వివరాలు:

ఈ యాత్ర మొత్తం 9 రాత్రులు, 10 రోజుల పాటు సాగుతుంది. ప్రయాణికుల కోసం ఈ రైలులో మొత్తం 705 సీట్లను కేటాయించారు. ఇందులో స్లీపర్ క్లాస్ (ఎకానమీ) విభాగంలో 237 సీట్లు, థర్డ్ ఏసీ విభాగంలో 416 సీట్లు, సెకండ్ ఏసీ విభాగంలో 52 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

రైలు ఆగే స్టేషన్లు (బోర్డింగ్ / డీబోర్డింగ్):

తెలుగు రాష్ట్రాల్లోని ప్రయాణికులకు అనుకూలంగా పలు కీలక స్టేషన్లలో రైలు ఎక్కేందుకు, దిగేందుకు



ఐఆర్‌సీటీసీ ఏర్పాట్లు చేసింది. సికింద్రాబాద్‌తో పాటు చర్లపల్లి, కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, గుడివాడ, భీమవరం, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం స్టేషన్లలో బోర్డింగ్, డీబోర్డింగ్ సదుపాయం కల్పించారు.

సందర్శించే పుణ్యక్షేత్రాలు:

పూరి: జగన్నాథ స్వామి దర్శనం, ప్రత్యేక పూజలు, కోణార్క్ సూర్య దేవాలయ సందర్శన.

బద్రీనాథ్ ధామ్: బద్రీనాథ్ దర్శనం.

వారణాసి: కాశీ విశ్వనాథ ఆలయం, విశాలాక్షి, అన్నపూర్ణ అమ్మవార్ల దర్శనం, కాశీ కారిడార్ సందర్శన మరియు సాయంత్రం ప్రసిద్ధ గంగా హారతి తిలకించే అవకాశం.అయోధ్య: బలరామ్ మందిర్, హనుమాన్ గర్హి దర్శనం, సరయూ నది హారతి.

ప్రయాగ్‌రాజ్: త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం.

ఈ క్షేత్రాల దర్శనం అనంతరం రైలు తిరిగి సికింద్రాబాద్ చేరుకుంటుంది.

ప్యాకేజీ ధరల వివరాలు (ఒక్కొక్కరికి):

ఎకానమీ (స్లీపర్): పెద్దలకు రూ. 17,000, 5 నుంచి 11 ఏళ్ల లోపు చిన్నారులకు రూ. 15,800

స్టాండర్డ్ పెద్దలకు రూ. 26,400, చిన్నారులకు రూ. 25,000

కంఫర్ట్ పెద్దలకు రూ. 34,400, చిన్నారులకు రూ. 32,700

ఈ ప్యాకేజీ ధరల్లో రైలు ప్రయాణ చార్జీలతో పాటు స్థానిక సందర్శనకు రోడ్డు రవాణా, హోటల్ వసతి, ఉదయం అల్పాహారం, భోజనం వంటి ఆహార సదుపాయాలు, ప్రయాణ బీమా అన్నీ కలిపి ఉంటాయని సంస్థ స్పష్టం చేసింది.

ఈ యాత్రకు సంబంధించిన టికెట్ బుకింగ్స్, ఇతర పూర్తి వివరాలు తెలుసుకోవడానికి ప్రయాణికులు ఐఆర్‌సీటీసీ అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్‌ను పరిశీలించవచ్చని అధికారులు సూచించారు.

ఖాకీ చొక్కా వదిలి కార్పొరేట్ సూటు..

రిటైర్డ్ పోలీసులకు నెలకు భారీ ప్యాకేజీలు!

రిటైర్డ్ హైదరాబాద్ పోలీస్ అధికారులకు కార్పొరేట్ రంగంలో భారీ డిమాండ్


రియల్ ఎస్టేట్, ఫైనాన్స్, సెక్యూరిటీ సంస్థల్లో కీలక బాధ్యతలు

రిటైర్మెంట్‌కు ముందే అధికారులను సంప్రదిస్తున్న ప్రముఖ కంపెనీలు

సంక్షోభ నిర్వహణ, కౌన్సెలింగ్, లీగల్ అంశాల పరిష్కారంలో వీరికి ప్రాధాన్యం

మొండి బకాయిల రికవరీ, అంతర్గత వివాదాల పరిష్కారంలో ప్రత్యేక బాధ్యతలు

నవంబర్ 23,(ప్రజావినికిడి):



రిటైర్మెంట్ తర్వాత ఇంటికే పరిమితం కాకుండా.. హైదరాబాద్‌కు చెందిన మాజీ పోలీసు అధికారులు కార్పొరేట్ రంగంలో సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలుస్తోంది. దశాబ్దాల పాటు శాంతిభద్రతల పరిరక్షణలో గడించిన అనుభవం, సంక్షోభ నిర్వహణ నైపుణ్యాలు వారికి కార్పొరేట్ సంస్థల్లో భారీ జీతాలతో కూడిన ఆకర్షణీయమైన కొలువులను తెచ్చిపెడుతున్నాయి. రియల్ ఎస్టేట్, ఫైనాన్స్, సెక్యూరిటీ, విద్య, హెల్త్‌కేర్ వంటి కీలక రంగాల్లోని ప్రముఖ కంపెనీలు రిటైర్డ్ పోలీస్ అధికారులకు నెలకు రూ. 1.5 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ వేతనాలు, అదనపు అలవెన్సులు అందిస్తూ స్వాగతం పలుకుతున్నాయి.

ఓ ఆంగ్ల మీడియా కథనం ప్రకారం.. పాలనాపరమైన వ్యవహారాలు చక్కబెట్టడం, విపత్కర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొన్న ట్రాక్ రికార్డు ఉండటంతో కార్పొరేట్ కంపెనీలు వీరి సేవలకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాయి. పదవీ విరమణకు కొన్ని నెలల ముందే కంపెనీలు మంచి సర్వీస్ రికార్డు ఉన్న అధికారులను సంప్రదిస్తున్నాయి. ఇటీవల పదవీ విరమణ చేసిన ఓ డీఎస్పీ స్థాయి అధికారి మాట్లాడుతూ.. సర్వీస్ ముగియకముందే మూడు కంపెనీలు తనను సంప్రదించాయని తెలిపారు. ప్రయోజనాలను బేరీజు వేసుకుని ఒక రియల్ ఎస్టేట్ సంస్థలో చేరినట్లు వెల్లడించారు. నెగోషియేషన్లు, కౌన్సెలింగ్, సమర్థమైన కమ్యూనికేషన్ ద్వారా సమస్యలను పరిష్కరించే సామర్థ్యం వీరిని కార్పొరేట్ రంగానికి మరింత దగ్గర చేస్తోంది.

లీగల్ కన్సల్టెంట్లుగా, సెక్యూరిటీ హెడ్స్‌గా మాత్రమే కాకుండా.. మొండి బకాయిల వసూలు, ఆర్థిక మోసాల అడ్డుకట్ట, అంతర్గత వివాదాల పరిష్కారం, వ్యాపార విస్తరణకు తమ నెట్‌వర్క్‌ను వినియోగించడంలో వీరి నైపుణ్యాలను యాజమాన్యాలు వాడుకుంటున్నాయి. ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) లేదా అంతకంటే ఉన్నత హోదాలో రిటైరైన సీనియర్ అధికారులను పెద్ద కంపెనీలు కీలక అంశాల్లో సలహాదారులుగా నియమించుకుంటున్నాయి. మరోవైపు, యువ ఉద్యోగులతో కలిసి పనిచేయడం, కొత్త వాతావరణంలోకి అడుగుపెట్టడం వల్ల పదవీ విరమణ తర్వాత వచ్చే ఒంటరితనాన్ని దూరం చేసుకుంటూ ప్రొఫెషనల్ లైఫ్‌ను ఉత్సాహంగా కొనసాగించే అవకాశం వీరికి లభిస్తోంది.

ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీపై నాన్-బెయిలబుల్ వారెంట్



నవంబర్ 23,(ప్రజావినికిడి):

ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీకి ఢిల్లీలోని సాకేత్ కోర్టు నాన్-బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేసింది. ఎనిమిదేళ్ల క్రితం దాఖలైన పరువునష్టం కేసులో విచారణకు పదేపదే గైర్హాజరు కావడంతో కోర్టు ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. కేసు తదుపరి విచారణను డిసెంబర్ 3కి వాయిదా వేసింది.

వికాస్ సాంకృత్యాయన్ అలియాస్ వికాస్ పాండే అనే వ్యక్తి ఈ పరువునష్టం కేసును దాఖలు చేశారు. 'బీజేపీ ఐటీ సెల్ పార్ట్ 2' పేరుతో ధ్రువ్ రాఠీ రూపొందించిన వీడియో తన ప్రతిష్ఠకు భంగం కలిగించిందని 'ఐ సపోర్ట్ నరేంద్ర మోదీ' అనే సోషల్ మీడియా పేజీ వ్యవస్థాపకుడైన వికాస్ పాండే తన ఫిర్యాదులో పేర్కొన్నారు.గతంలో పలుమార్లు సమన్లు జారీ చేసినా, బెయిలబుల్ వారెంట్లు ఇచ్చినా ధ్రువ్ రాఠీ కోర్టుకు హాజరుకాలేదు. ప్రస్తుతం ఆస్ట్రియాలో నివసిస్తున్న రాఠీకి సమన్లు అందించడం కష్టంగా మారింది. ఆయన దేశంలో లేకపోవడం వల్లే కేసు విచారణ ఆలస్యమవుతోందని ఫిర్యాదుదారు వాదిస్తున్నారు.2018లో ఇదే వీడియోను ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కూడా రీట్వీట్ చేశారు. అయితే, ఆ తర్వాత సుప్రీంకోర్టులో ఈ విషయంపై విచారణ జరిగినప్పుడు, ఆ వీడియోను షేర్ చేసి తాను పొరపాటు చేశానని కేజ్రీవాల్ అంగీకరించడం గమనార్హం. ఇప్పుడు ధ్రువ్ రాఠీ కోర్టుకు హాజరుకాకపోవడంతో న్యాయస్థానం నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.

కూకట్‌పల్లిలో హుడా ట్రక్ పార్కింగ్ స్థలం వేలాన్ని వ్యతిరేకిస్తూ ఈటల రాజేందర్ ధర్నా



నవంబర్ 23,(ప్రజావినికిడి):

ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారుల మాదిరిగా విక్రయించడం ఎంతమాత్రం సరికాదని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని వై జంక్షన్ మెట్రో వద్ద ఉన్న ఉన్న హుడా ట్రక్ పార్కింగ్ స్థలాన్ని ప్రభుత్వం వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు.ప్రజావసరాల కోసం కేటాయించిన భూములను ప్రభుత్వం ఇలా వేలం వేసుకుంటూ పోతే భవిష్యత్తులో ప్రజలకు, రాబోయే తరాలకు ఖాళీ స్థలాలే లేకుండా పోతాయని ఈటల రాజేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనాల కోసం ఆలోచించాలి తప్ప, ఆదాయం కోసం భూములు అమ్మే వ్యాపార సంస్థల్లా వ్యవహరించకూడదని ఆయన హితవు పలికారు. పేదలకు కేటాయించిన అసైన్డ్ భూములతో పాటు ప్రజావసరాల కోసం ఉద్దేశించిన స్థలాలను ప్రభుత్వం బాధ్యతాయుతంగా కాపాడాలని స్పష్టం చేశారు.రాష్ట్రంలోని కీలక ప్రాంతాల్లో జరిగిన భూ కేటాయింపులపై ఆయన పలు అనుమానాలు వ్యక్తం చేశారు. నియోపోలిస్, గచ్చిబౌలి, ఐడీఎల్, ఎల్లమ్మబండ, భాగ్యనగర్ పరిధిలోని వివాదాస్పద భూముల వ్యవహారాలపై వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐపీఎస్ జయేశ్ రంజన్ వీఆర్ఎస్.. ?

సొంత కన్సల్టెన్సీ ఏర్పాటు కోసమేనా..?

తెలంగాణ సీనియర్ ఐపీఎస్ జయేశ్ రంజన్ వీఆర్ఎస్‌కు దరఖాస్తు

పదవీ విరమణకు ఏడాది ముందే వైదొలగాలని నిర్ణయం

సొంతంగా కన్సల్టెన్సీ సంస్థ ఏర్పాటు చేసే అవకాశం ఉందని ప్రచారం

హైదరాబాద్‌కు పెట్టుబడులు తెచ్చేందుకు కొత్త కంపెనీలకు సలహాలు

తెలంగాణ ఐటీ, పరిశ్రమల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన అధికారి

నవంబర్ 23,(ప్రజావినికిడి):



తెలంగాణ ప్రభుత్వంలో అత్యంత కీలకమైన ఐపీఎస్ అధికారి, ఐటీ, పరిశ్రమల శాఖల మాజీ కార్యదర్శి జయేశ్ రంజన్ స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్)కు దరఖాస్తు చేసుకోవడం అధికార వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సర్వీసు నుంచి తప్పుకున్న తర్వాత ఆయన భవిష్యత్ ప్రణాళికలపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆయన సొంతంగా ఒక కన్సల్టెన్సీ సంస్థను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు సచివాలయ వర్గాల్లో బలంగా ప్రచారం జరుగుతోంది.

హైదరాబాద్‌లో వ్యాపారాలు ప్రారంభించాలనుకునే కొత్త కంపెనీలకు తన అనుభవాన్ని పంచుతూ మార్గనిర్దేశం చేయడమే ఈ కన్సల్టెన్సీ ముఖ్య ఉద్దేశమని తెలుస్తోంది. పెట్టుబడుల ఆకర్షణ, ప్రభుత్వ విధానాలు, అనుమతుల ప్రక్రియ వంటి క్లిష్టమైన అంశాల్లో ఆయనకు ఉన్న అపారమైన అనుభవం, కార్పొరేట్ ప్రపంచంతో ఉన్న సత్సంబంధాలు ఈ కొత్త సంస్థకు పునాదిగా నిలుస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఈ విషయంపై జయేశ్ రంజన్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.1992 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారిగా జయేశ్ రంజన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కడప, గుంటూరు, మెదక్ జిల్లాల కలెక్టర్‌గా పనిచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఐటీ, పరిశ్రమల శాఖ కార్యదర్శిగా ఆయన పోషించిన పాత్ర అత్యంత కీలకం. హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటీ హబ్‌గా మార్చడంలో, టీ-హబ్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల ఏర్పాటులో, అంతర్జాతీయ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. తెలంగాణ ఐటీ రంగ ముఖచిత్రాన్ని మార్చిన కొద్దిమంది అధికారుల్లో ఆయన ఒకరిగా గుర్తింపు పొందారు.ప్రస్తుతం ఆయన మెట్రోపాలిటన్ ప్రాంత, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూనే, పర్యాటక, సాంస్కృతిక, క్రీడల శాఖల అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వాస్తవానికి ఆయన 2027 సెప్టెంబర్ 30న పదవీ విరమణ చేయాల్సి ఉంది. కానీ, దాదాపు ఏడాది ముందుగానే వీఆర్ఎస్ కోరుతూ ప్రభుత్వానికి దరఖాస్తు సమర్పించినట్లు తెలుస్తోంది. ఈ దరఖాస్తును కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ, రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం పరిశీలించి ఆమోదించాల్సి ఉంటుంది.

ఏటా జనవరిలో జరిగే దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో తెలంగాణ తరఫున పెట్టుబడుల ఆకర్షణ బృందానికి జయేశ్ రంజన్ నాయకత్వం వహించడం తెలిసిందే. అయితే, ఈసారి ఆయన దావోస్ పర్యటనకు దూరంగా ఉండవచ్చనే ప్రచారం కూడా జరుగుతోంది. ఆయన వీఆర్ఎస్ నిర్ణయం ఈ ఊహాగానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది

2 రోజుల్లో 76 వేల నామినేషన్లు

4,244 గ్రామాల్లో సర్పంచ్‌లకు 16,505

వార్డు పదవులకు 60,420 దాఖలు మూడో విడత ఎన్నికల్లో పోటా పోటీ

అమరావతి, నవంబర్ 23,(ప్రజావినికిడి):

రాష్ట్రంలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పోటాపోటీగా సాగింది. 21, 22 తేదీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు ఏకంగా 76 వేల మందికి పైగా నామినేషన్లు దాఖలు చేశారు. మూడో విడతలో ఎన్నికలు నిర్వహించనున్న 25 జిల్లాల్లోని 4,244 గ్రామ పంచాయతీలలో సర్పంచ్ పదవులకు 16,505 నామినేషన్లు, వార్డు సభ్యుల పదవులకు 60,420 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో సర్పంచ్ పదవులకు మొదటి రోజు 4,929, రెండో రోజు 11,576 నామినేషన్లు అందాయి. వార్డు సభ్యుల పదవులకు తొలిరోజు 13,611, రెండో రోజు 46,809 నామినేషన్లు దాఖలయ్యాయి.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

గ్లోబల్ మారిటైమ్ గేట్‌వేగా ఏపీ

విశాఖలో ఆసియాన్-ఇండియా సదస్సు

బ్లూ ఎకానమీపై నారా లోకేశ్ కీలక ప్రసంగం

దుగరాజపట్నంలో రూ. 30 వేల కోట్లతో నౌకా నిర్మాణ క్లస్టర్

విశాఖలో ఇటీవల రూ. 7,500 కోట్ల విలువైన ఒప్పందాలు



విశాఖపట్నం నవంబర్ 23,(ప్రజావినికిడి):

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సముద్ర వాణిజ్యం, పారిశ్రామిక రంగానికి ప్రధాన గేట్‌వేగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విశాఖపట్నంలో ఇండియా ఫౌండేషన్, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించిన 'ఆసియాన్-ఇండియా మారిటైమ్ సదస్సు'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సముద్ర మార్గాల అనుసంధానత, సాంకేతికత, క్లీన్ ఎనర్జీ, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో ఆగ్నేయాసియా దేశాలతో ఆంధ్రప్రదేశ్ బలమైన, దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని కోరుకుంటోందని ఆయన తెలిపారు.విశాఖపట్నానికి గొప్ప సముద్ర చరిత్ర ఉందని, ఈ నగరం తూర్పు నౌకా దళానికి (ఈస్టర్న్ నేవల్ కమాండ్) ప్రధాన కేంద్రంగా ఉండటంతో పాటు శరవేగంగా ఐటీ, వాణిజ్య కేంద్రంగా ఎదుగుతోందని లోకేశ్ పేర్కొన్నారు. దేశంలోనే రెండో అతిపెద్ద తీరప్రాంతం (దాదాపు 1,053 కిలోమీటర్లు) కలిగిన ఆంధ్రప్రదేశ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో అంతర్జాతీయ స్థాయి లాజిస్టిక్స్, ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం పోర్టు 91.17 మిలియన్ టన్నుల కార్గోను నిర్వహించి దాదాపు 10 శాతం వృద్ధితో సరికొత్త రికార్డు సృష్టించిందని ఆయన గుర్తుచేశారు.రాష్ట్రంలో సముద్ర రవాణా మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడలలో నాలుగు కొత్త పోర్టుల నిర్మాణం వేగంగా జరుగుతోందని లోకేశ్ తెలిపారు. ఈ పోర్టులు ఏపీతో పాటు పొరుగు రాష్ట్రాల పారిశ్రామిక అవసరాలకు ఎంతో దోహదపడతాయని అన్నారు. అలాగే తిరుపతి జిల్లా దుగరాజపట్నంలో దాదాపు రూ. 30,000 కోట్ల భారీ పెట్టుబడితో ప్రధాన షిప్‌బిల్డింగ్ (నౌకా నిర్మాణ) క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు వెల్లడించారు. ఇటీవల కాలంలోనే విశాఖ కేంద్రంగా పోర్టుల విస్తరణ, లాజిస్టిక్స్, ప్రత్యేక టెర్మినల్స్, షిప్ రిపేరింగ్ రంగాల్లో రూ. 7,500 కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు (వీశీఖం) కుదిరాయని తెలిపారు. పోర్టులను పరిశ్రమలతో అనుసంధానించడం, తద్వారా ఆ పరిశ్రమల ఉత్పత్తులను గ్లోబల్ మార్కెట్లకు చేర్చడమే తమ వ్యూహమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విధానాలను లోకేశ్ ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం బ్లూ ఎకానమీకి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని కొనియాడారు. సాగరమాల, మారిటైమ్ ఇండియా విజన్ 2030, మారిటైమ్ అమృత్ కాల్ విజన్ 2047 వంటి బృహత్తర కార్యక్రమాలు దేశ ప్రగతికి బాటలు వేస్తున్నాయని చెప్పారు. నౌకా నిర్మాణ రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర కేబినెట్ రూ. 25,000 కోట్ల డెవలప్‌మెంట్ ఫండ్‌తో కలిపి మొత్తం రూ. 70,000 కోట్ల భారీ ప్యాకేజీని ఆమోదించిందని గుర్తుచేశారు.

ఓంకారంలో కార్తీక పూజలు

అలరించిన కూచిపూడి నాట్యం



బండి ఆత్మకూరు,నవంబర్ 23,(ప్రజావినికిడి):

పరమశివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం కావడంతో నల్లమల అటవీ ప్రాంతంలోని ఓంకార క్షేత్రంలో భక్తులు కార్తీక మాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక మాసం రెండవ సోమవారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ గంగా ఉమా సమేత ఓంకార సిద్దేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు అభిషేకాలు కుంకుమార్చనలు జరిపించారు. ముందుగా భక్తులు పంచముగ్గల కోనేటిలో పుణ్యస్నానాలు ఆచరించి అభయాంజనేయ స్వామి ఎదురుగా కార్తీక ద్విపాలు వెలిగించి వారు మొక్కలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ అల్లె చెన్నారెడ్డి,ఆలయ కార్య నిర్వహణ అధికారి నాగ ప్రసాద్ భక్తులకు వసతి సదుపాయాలు కల్పించారు. భక్తుల కాలక్షేపం కోసం శ్రీ సాయి నాట్యాంజలి కూచిపూడి కళాక్షేత్రం సంధ్యాల వారు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. కాగా క్షేత్రానికి వచ్చిన భక్తులకు శ్రీ కాశిరెడ్డి నాయన ఆశ్రమ నిర్వాహకులు ఉచిత అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అమాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఏపీ కేబినెట్ సమావేశం నవంబర్ 27కి వాయిదా.. హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహణ

నవంబర్ 23,(ప్రజావినికిడి):

ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 26న జరగాల్సిన ఈ భేటీని నవంబర్ 27వ తేదీకి రీషెడ్యూల్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సంబంధించిన మార్పులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జి. సాయిప్రసాద్ సోమవారం ఒక అధికారిక కేబినెట్ నోట్ ద్వారా వెల్లడించారు.రాష్ట్రంలోని 23 పట్టణ స్థానిక సంస్థలకు (అర్బన్ లోకల్ బాడీస్) సంబంధించి నవంబర్ 26వ తేదీన పోలింగ్ జరగనుంది. ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఆ రోజున ప్రభుత్వం సాధారణ సెలవు దినంగా ప్రకటించింది. అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ఆ ప్రక్రియలో నిమగ్నమై ఉండే అవకాశం ఉండటంతో, కేబినెట్ సమావేశాన్ని ఆ మరుసటి రోజు (నవంబర్ 27న) నిర్వహించాలని నిర్ణయించారు.ఈ మంత్రివర్గ సమావేశాన్ని హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించనున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో అందుబాటులో ఉండే మంత్రులు నేరుగా భేటీకి హాజరుకావాల్సి ఉంటుంది. వివిధ కారణాల వల్ల వ్యక్తిగతంగా సచివాలయానికి రాలేని మంత్రులు వర్చువల్ విధానం (వీడియో కాన్ఫరెన్స్) ద్వారా సమావేశంలో పాల్గొనవచ్చని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పలు కీలక ప్రభుత్వ విధానాలు, తాజా పరిణామాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశముంది.

కొలువుదీరిన పుర పాలకులు

మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్, కార్పొరేటర్లు, కౌన్సిలర్ల ప్రమాణం

తండ్రి మరణంతో విశాఖ మేయర్ ప్రమాణం వాయిదా

పలు మున్సిపాలిటీల్లో వైస్‌చైర్మన్ ఎన్నిక నేటికి వాయిదా

ఆత్మకూరు వైస్‌చైర్మన్ ఎన్నికపై జనసేనలో విభేదాలు

అధిష్ఠానం ప్రకటించిన అభ్యర్థిని కాదని మరొకరి ఎంపికతో గొడవ

పిఠాపురం వైస్‌చైర్మన్ ఎన్నికలోనూ వివాదం

మార్కాపురంలో జనసేన కార్యాలయం ఎదుట నిరసన



అమరావతి నవంబర్ 23,(ప్రజావినికిడి):

రాష్ట్రవ్యాప్తంగా నగరపాలకసంస్థలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. తాజాగా ఎన్నికల్లో గెలుపొందిన మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు.ఎన్టీఆర్ జిల్లా విజయవాడ

మునిసిపల్ కార్పొరేషన్ మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ) మేయర్‌గా ఎన్నికైన ముక్కా శ్రావణి తండ్రి ముత్యాలనాయుడు ఇటీవల మృతిచెందడంతో ఆమె ప్రమాణస్వీకారం వాయిదా పడింది. 49వ డివిజన్ కార్పొరేటర్‌గా ఎన్నికైన ఆమె సోదరి పొట్నూరు నీలవేణి కూడా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకాలేదు. మిగిలిన 119 మంది కార్పొరేటర్లతో కలెక్టర్ అభిషిక్త్ ఒకేసారి ప్రమాణం చేయించారు. అనంతరం డిప్యూటీ మేయర్‌గా 37వ డివిజన్ కార్పొరేటర్ పీవీ శివప్రసాద్(జనసేన) ఎన్నికయ్యారు. కడప నగరపాలక సంస్థ తొలి మహిళా మేయరుగా మళ్లి సువర్ణ ప్రమాణ స్వీకారం చేశారు.

నెల్లూరు జిల్లా ఆత్మకూరు మున్సిపాలిటీలో వైస్‌చైర్మన్ ఎన్నిక వివాదాస్పదం కావడంతో మంగళవారానికి వాయిదా పడింది. కూటమి ఒప్పందంలో భాగంగా ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. ఆ పార్టీ అధిష్ఠానం 11వ వార్డు కౌన్సిలర్ కొలగ శిరీషను వైస్‌చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించింది. అయితే ఆమెను కాదని అదేపార్టీకి చెందిన 6వ వార్డు కౌన్సిలర్ కత్తి పద్మజను వైస్‌చైర్మన్ అభ్యర్థిగా నిలబెట్టారు. దీంతో బీఫారం పొందిన శిరీష మున్సిపల్ సమావేశంలోనే ఎన్నికల అధికారిని, మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని నిలదీశారు. ఆమె వాదనను ఎవరూ పట్టించుకోకపోగా, మహిళా పోలీసులు శిరీషను వెలుపలికి తీసుకెళ్లారు. దీంతో శిరీష మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. పార్టీకి, రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో వైస్‌చైర్మన్ ఎన్నికలో తప్పిదం జరిగిందని గుర్తించిన అధికారులు వైస్‌చైర్మన్ ఎన్నికను మంగళవారానికి వాయిదా వేశారు.

మార్కాపురం మునిసిపల్ వైస్‌చైర్మన్ పదవి పొత్తు ధర్మంలో భాగంగా జనసేనకు కేటాయించారు. వైస్‌చైర్మన్ పదవికి కొప్పుల నాగజ్యోతి పేరు ప్రకటించారు. ఆమెను వైస్‌చైర్‌పర్సన్‌గా సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక సందర్భంగా గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. జనసేన అధికారికంగా ప్రకటించిన బొజ్జా వెంకటేశ్వరరావు(దొరబాబు)కు ఆరుగురు సభ్యులు మాత్రమే మద్దతు తెలిపారు. ఈ దశలో పిండి సంధ్య పేరును జనసేన కౌన్సిలర్ రెడ్డెం రామారావు(రమేష్) ప్రతిపాదించారు. బొజ్జా వెంకటేశ్వరరావు, రెడ్డెం రమేష్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఎన్నికల తర్వాత వచ్చిన వ్యక్తికి వైస్‌చైర్మన్ పదవి ఎలా ఇస్తారని రమేష్ ప్రశ్నించారు. చివరికి బొజ్జా వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం ఎంపీ ఉదయశ్రీనివాస్ అనుచరుడు వీరంరెడ్డి చక్రిపై జనసేనలోని ఒక వర్గం నాయకులు దాడి చేసి తరిమికొట్టారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు.శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గ మునిసిపల్ వైస్ చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు టంకాల రవిశంకర్ గుప్తాను ఎన్నికల సమయంలోనే ప్రకటించారు. అయితే, అనూహ్యంగా వైస్‌చైర్మన్ సీటుగా వాడరేవు అశోక్ పేరును జనసేన ప్రకటించింది. దీన్ని టీడీపీ అధిష్ఠానం కూడా ఖరారు చేసింది. అయితే, ప్రమాణస్వీకారం అనంతరం కౌన్సిలర్లు ఇళ్లకు వెళ్లిపోవడంతో వైస్‌చైర్మన్ ఎన్నికను కోరం లేదంటూ మంగళవారానికి వాయిదా వేశారు.

పురాతన ఆలయాన్ని కూల్చివేయడం దారుణం: భూమన కరుణాకర్ రెడ్డి

నవంబర్ 23,(ప్రజావినికిడి):

తిరుపతి జిల్లా రేణిగుంట మండలం ఆంజనేయపురంలోని అభయ ఆంజనేయస్వామి ఆలయం తొలగింపు స్థానికంగా తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. కడప-రేణిగుంట జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అధికారులు ఈ ఆలయ నిర్మాణాన్ని తొలగించారు. ఈ పరిణామంపై వైసీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.ఆలయ కూల్చివేత సమాచారం అందుకున్న టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పనులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఆయన కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పల్లవ రాజుల కాలం నాటి ఈ పురాతన ఆలయంలో అన్నమయ్య, కంచి చంద్రశేఖర స్వామీజీ పూజలు చేసినట్లు చరిత్ర ఉందని భూమన పేర్కొన్నారు. ఇంతటి ప్రాశస్త్యం కలిగిన ఆలయాన్ని కూల్చివేయడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

జాతీయ రహదారి డిజైన్‌లో మార్పులు చేసే అవకాశం ఉన్నప్పటికీ, కక్ష సాధింపు ధోరణితోనే ప్రభుత్వం ఆలయాన్ని తొలగించిందని భూమన ఆరోపించారు. సనాతన ధర్మ పరిరక్షణ గురించి మాట్లాడే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్... పురాతన హిందూ ఆలయాల తొలగింపును ఎలా సమర్థిస్తారని, ఆలయాల పరిరక్షణ అంటే ఇదేనా అని ఆయన ప్రశ్నించారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబుకు హిందూ ఆలయాల పరిరక్షణ పట్ల చిత్తశుద్ధి లేదని ఘాటుగా విమర్శించారు

హైదరాబాద్‌లో 'ట్రాఫిక్ రద్దీ ఛార్జీలు'?.. ఐటీ కారిడార్‌లో పైలట్ ప్రాజెక్టు?

హైదరాబాద్‌లో ట్రాఫిక్ తగ్గించేందుకు కన్జెషన్ ఛార్జ్ ప్రతిపాదన

రుసుము చెల్లించేందుకు సిద్ధమన్న వాహనదారులు

వసూలైన నిధులను ప్రజా రవాణా మెరుగుదలకే వాడాలని సూచన

ఐటీ కారిడార్‌లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని సిఫార్సు



నవంబర్ 23,(ప్రజావినికిడి):

హైదరాబాద్ నగరంలో నానాటికీ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు 'కన్జెషన్ ఛార్జ్' (రద్దీ రుసుము) అమలు చేయడం ఒక ఉత్తమ మార్గమని బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్ పరిశోధకులు సూచిస్తున్నారు. ప్రయాణ సమయం తగ్గడంతో పాటు, వసూలు చేసిన రుసుమును ప్రజా రవాణా వ్యవస్థ మెరుగుదలకు వెచ్చిస్తే, నగర వాహనదారులు ఈ రుసుమును చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారని వారి అధ్యయనంలో వెల్లడైంది.

బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌కు చెందిన ట్రాన్స్‌పోర్టేషన్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ల్యాబ్, కార్డిఫ్ యూనివర్సిటీ, కింగ్ ఫాహద్ యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం అండ్ మినరల్స్ సంయుక్తంగా భారత ప్రభుత్వ నిధులతో ఈ పరిశోధనను చేపట్టాయి. ఇందులో భాగంగా 435 మంది కారు ప్రయాణికుల అభిప్రాయాలను సేకరించగా, ప్రయాణ సమయం ఆదా కావడమే తమకు అత్యంత ప్రధానమైన ప్రయోజనమని అత్యధికులు అభిప్రాయపడ్డారు.పెరుగుతున్న వాహనాల సంఖ్యతో పాటు రోడ్ల వెడల్పులో వ్యత్యాసాలు, పాదచారుల సౌకర్యాల కొరత, రహదారులపై పార్కింగ్, అశాస్త్రీయ జంక్షన్ల వల్లే ట్రాఫిక్ సమస్య జటిలమవుతోందని ప్రొఫెసర్ ప్రశాంత సాహు విశ్లేషించారు. ఐటీ కారిడార్ వంటి అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఈ విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని పరిశోధకులు సిఫార్సు చేశారు. హైటెక్ సిటీలోని సైబర్ టవర్స్ వద్ద గంటకు సగటున 10 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, వీటిలో అత్యధిక శాతం సింగిల్ ఆక్యుపెన్సీ వాహనాలేనని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో వాహనాల సంఖ్య 2025 నాటికే 94.78 లక్షలకు చేరగా, 2026 చివరి నాటికి కోటి మార్కుకు చేరువవుతుందని అంచనా. ఈ నేపథ్యంలో, కన్జెషన్ ఛార్జ్ ద్వారా సమకూరిన నిధులతో బస్సు సర్వీసులు, ఫుట్‌పాత్‌లు, ఇతర ప్రజా రవాణా సౌకర్యాలను మెరుగుపరిస్తే ఆశించిన ఫలితాలు వస్తాయని అధ్యయనం పేర్కొంది. అయితే, ఇది కేవలం పరిశోధనలోని సిఫార్సు మాత్రమేనని, ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయం కాదని పరిశోధక బృందం స్పష్టం చేసింది.

కాంగ్రెస్‌కు 90 సీట్లు ఎలా వస్తాయి?

: రేవంత్ రెడ్డికి బండి సంజయ్ ప్రశ్న

హామీల అమలుపై సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీసిన సంజయ్

నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2,500 ఏవని నిలదీత

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా



నవంబర్ 23,(ప్రజావినికిడి):

తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 90 స్థానాలు ఎలా వస్తాయంటూ సీఎం రేవంత్‌రెడ్డిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. కరీంనగర్‌లో పర్యటించిన ఆయన, పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏం హామీలను సమర్థవంతంగా అమలు చేశారని కాంగ్రెస్‌కు ప్రజలు 90 సీట్లు ఇస్తారు? అంటూ ఆయన నిలదీశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రధాన హామీలపై స్పందిస్తూ, యువతకు నిరుద్యోగ భృతి ఇచ్చారా? అని సంజయ్ ప్రశ్నించారు. అలాగే అర్హులైన మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్న హామీ ఎందుకు అమలు కాలేదని ఆరోపించారు. ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని, తెలంగాణలో బీజేపీకి అధికారం అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశంలో కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని బండి సంజయ్ విమర్శించారు. "చనిపోయిన వారి ఓట్లు తీసేస్తే తప్పా? దేశద్రోహుల ఓట్లను తొలగించడం తప్పా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రధానిని ఎవరు నిర్ణయించాలనేది ప్రజల చేతుల్లోనే ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే రాజకీయ సమరం ప్రారంభమైందని, తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాగా, బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై అధికార కాంగ్రెస్ పార్టీ లేదా ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

బౌలర్లకు విశ్రాంతి..
టీమిండియా కీలక నిర్ణయం

● శుభ్‌మన్ గిల్ చొరవతో టీమ్ యాక్టివిటీ రద్దు..

ఆటగాళ్ల పనిభారం తగ్గించడమే లక్ష్యం



స్పోర్ట్స్ డెస్క్: న్యూజిలాండ్‌తో రెండో టెస్టుకు ముందు భారత క్రికెట్ జట్టు యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. బౌలర్లపై పనిభారం తగ్గించి, వారికి తగిన విశ్రాంతి కల్పించేందుకు ముందుగా నిర్ణయించిన టీమ్ యాక్టివిటీ కార్యక్రమాన్ని రద్దు చేసింది. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ విషయాన్ని వెల్లడించాడు.వెల్లింగ్టన్ వేదికగా భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన తొలి టెస్టు డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 368 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం భారత జట్టు తొమ్మిది వికెట్ల నష్టానికి 720 పరుగులు చేసి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. దీంతో భారత్‌కు 352 పరుగుల ఆధిక్యం లభించింది.రెండో ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ బ్యాటర్లు పట్టుదలగా పోరాడారు. డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ వికెట్లు కోల్పోకుండా భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. దీంతో కివీస్ ఐదు వికెట్ల నష్టానికి 239 పరుగులు చేసి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది.ఈ టెస్టులో భారత బౌలర్లు రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 241 ఓవర్లు బౌలింగ్ చేయాల్సి వచ్చింది. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ అత్యధికంగా 55 ఓవర్లు బౌలింగ్ చేశాడు. ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్లు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.ఈ నేపథ్యంలో బౌలర్లకు విశ్రాంతి అవసరమని భావించిన గిల్ టీమ్ యాక్టివిటీని రద్దు చేసినట్లు తెలిపాడు. ఆటగాళ్లను అనవసరంగా అలసటకు గురిచేయకుండా, తదుపరి మ్యాచ్‌కు పూర్తి సంసిద్ధతతో ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాడు. అయితే జట్టు సభ్యులతో కలిసి డిన్నర్ కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించాడు.ఈ నెల 27 నుంచి క్రైస్ట్‌చర్చ్‌లో భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో టెస్టు ప్రారంభం కానుంది. తొలి టెస్టులో గెలుపు అవకాశాన్ని చేజార్చుకున్న టీమిండియా, రెండో మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్‌లో ఆధిక్యం సాధించాలని పట్టుదలతో ఉంది. బౌలర్లకు లభించిన విశ్రాంతి తదుపరి మ్యాచ్‌లో ఎంతవరకు ఉపయోగపడుతుందో చూడాలి.

టెస్టు క్రికెట్‌లో టీమిండియా
అరుదైన ఘనత

- ఒకే ఇన్నింగ్స్‌లో ఎనిమిది మంది బౌలర్ల వినియోగం.. వెల్లింగ్టన్ టెస్టులో రికార్డు నమోదు



స్పోర్ట్స్ డెస్క్: అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లో భారత జట్టు మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్ వేదికగా జరిగిన తొలి టెస్టులో టీమిండియా ఎనిమిది మంది బౌలర్లను ఉపయోగించి ప్రత్యేక ఘనత సాధించింది. ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేసేందుకు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అందుబాటులో ఉన్న బౌలింగ్ వనరులన్నింటినీ వినియోగించుకోవడం ఈ రికార్డుకు కారణమైంది. టెస్టు క్రికెట్ చరిత్రలో భారత జట్టు ఒకే ఇన్నింగ్స్‌లో ఎనిమిది మంది లేదా అంతకంటే ఎక్కువ మంది బౌలర్లను ఉపయోగించడం ఇది 28వసారి కావడం విశేషం.వెల్లింగ్టన్ టెస్టులో భారత జట్టు బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించింది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచింది. భారత బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో జట్టు 720 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, శుభ్‌మన్ గిల్ తమ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నారు. భారీ ఆధిక్యం సాధించినప్పటికీ న్యూజిలాండ్ బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్‌లో అసాధారణ పోరాట పటిమ కనబరిచారు.భారత బౌలర్లు వికెట్ల కోసం తీవ్రంగా శ్రమించారు. అయితే కివీస్ బ్యాటర్లు క్రీజులో పాతుకుపోవడంతో బౌలింగ్ వ్యూహాల్లో మార్పులు చేయాల్సి వచ్చింది. ప్రధాన బౌలర్లతో పాటు అదనపు బౌలింగ్ అవకాశాలను కూడా కెప్టెన్ ఉపయోగించుకున్నాడు. ఒకరి తర్వాత మరొకరికి బంతిని అందిస్తూ ప్రత్యర్థి బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టేందుకు ప్రయత్నించాడు. అయినప్పటికీ న్యూజిలాండ్ బ్యాటర్లు వికెట్లను కాపాడుకుంటూ మ్యాచ్‌ను డ్రా దిశగా తీసుకెళ్లారు.ఈ మ్యాచ్‌లో ఎనిమిది మంది బౌలర్లను ఉపయోగించడం భారత టెస్టు క్రికెట్ చరిత్రలో మరో ప్రత్యేక ఘట్టంగా నిలిచింది. గతంలోనూ భారత జట్టు పలు సందర్భాల్లో ఒకే ఇన్నింగ్స్‌లో ఎనిమిది మంది లేదా అంతకంటే ఎక్కువ మంది బౌలర్లను రంగంలోకి దించింది. శ్రీలంకతో కొలంబోలో జరిగిన టెస్టులోనూ ఇదే తరహా ప్రయోగం చేసింది. అంతకుముందు 1963-64లో ఇంగ్లండ్‌తో, 1952-53లో పాకిస్థాన్, వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లలోనూ ఇలాంటి సందర్భాలు నమోదయ్యాయి.

దీంతో భారత క్రికెట్‌లో ఈ అరుదైన రికార్డుకు సుదీర్ఘ చరిత్ర ఉన్నట్లు స్పష్టమవుతోంది.టెస్టు క్రికెట్‌లో ఒక జట్టు ఎనిమిది మంది బౌలర్లను ఉపయోగించాల్సిన పరిస్థితి సాధారణంగా ఎదురుకాదు. ప్రధాన బౌలర్లు అలసిపోవడం, ప్రత్యర్థి బ్యాటర్లు వికెట్లు కోల్పోకుండా ఆడటం, పిచ్ పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు మార్చాల్సి రావడం వంటి కారణాలతో అదనపు బౌలర్ల అవసరం ఏర్పడుతుంది. ఈ మ్యాచ్‌లోనూ భారత బౌలర్లు సుదీర్ఘ సమయం బౌలింగ్ చేయాల్సి రావడంతో కెప్టెన్ అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకున్నాడు.మరోవైపు న్యూజిలాండ్ బ్యాటర్లు కూడా భారత బౌలర్లకు గట్టి సవాల్ విసిరారు. ముఖ్యంగా చివరి దశలో వికెట్లు పడకుండా జాగ్రత్తగా ఆడుతూ మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. భారత జట్టు భారీ ఆధిక్యం సాధించినప్పటికీ విజయం అందుకోలేకపోవడం అభిమానులను నిరాశకు గురిచేసింది. అయినప్పటికీ ఒకే ఇన్నింగ్స్‌లో ఎనిమిది మంది బౌలర్లను ఉపయోగించడం ద్వారా టీమిండియా అరుదైన రికార్డును సాధించడం ఈ మ్యాచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.టెస్టు క్రికెట్‌లో విజయాలే కాకుండా ఇలాంటి అరుదైన రికార్డులు కూడా జట్టు ప్రయాణంలో ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తాయి. బౌలింగ్ విభాగంలో విభిన్న ఆటగాళ్లకు అవకాశాలు కల్పించడం, పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు మార్చుకోవడం జట్టు సమతుల్యతను తెలియజేస్తాయి. అయితే రికార్డులతో పాటు మ్యాచ్‌లను విజయాలుగా మలచుకోవడంపైనా టీమిండియా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రత్యర్థి జట్టుపై ఆధిపత్యం సాధించినప్పుడు దానిని చివరి వరకు కొనసాగించి విజయాన్ని అందుకోవడమే భారత జట్టు ముందున్న ప్రధాన లక్ష్యం.

డ్రాతో ముగిసిన పోరు..
గిల్ నిర్ణయం వెనుక అసలు కారణం!

బౌలర్ల అలసట.. పిచ్ నుంచి సహకారం కరువు.. మరో టెస్టుకు సిద్ధమయ్యేందుకే మ్యాచ్‌ను ముగించిన టీమిండియా కెప్టెన్



స్పోర్ట్స్ డెస్క్: న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో విజయం సాధించే అవకాశాలు ఉన్నప్పటికీ భారత జట్టు డ్రాతో సరిపెట్టుకోవడం క్రికెట్ అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. చివరి రోజు మరో 15 ఓవర్ల ఆట మిగిలి ఉండగానే ఇరు జట్ల కెప్టెన్లు మ్యాచ్‌ను డ్రాగా ముగించేందుకు అంగీకరించారు. అయితే ఈ నిర్ణయం వెనుక బలమైన కారణాలు ఉన్నాయని భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వెల్లడించాడు. బౌలర్లపై పెరిగిన పనిభారం, పిచ్ నుంచి లభించని సహకారం, తదుపరి టెస్టుకు తక్కువ సమయం ఉండటమే మ్యాచ్‌ను ముందుగానే ముగించడానికి ప్రధాన కారణాలని స్పష్టం చేశాడు.వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జట్టు బ్యాటింగ్‌లో అద్భుత ప్రదర్శన చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్‌ను 368 పరుగులకు ఆలౌట్ చేసిన భారత్.. అనంతరం తొమ్మిది వికెట్ల నష్టానికి 720 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. దీంతో ప్రత్యర్థిపై 352 పరుగుల భారీ ఆధిక్యాన్ని సాధించింది. కేఎల్ రాహుల్ 136 పరుగులతో రాణించగా, రిషభ్ పంత్ 128 పరుగులు చేశాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 98 పరుగులతో తృటిలో శతకాన్ని కోల్పోయాడు.రెండో ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్‌ను తక్కువ పరుగులకే కట్టడి చేసి విజయాన్ని అందుకోవాలని భారత బౌలర్లు ప్రయత్నించారు. అయితే ఆతిథ్య జట్టు బ్యాటర్లు పట్టుదలగా నిలిచారు. ముఖ్యంగా డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ భారత బౌలర్లకు వికెట్లు దక్కకుండా అడ్డుకున్నారు. చివరకు న్యూజిలాండ్ ఐదు వికెట్ల నష్టానికి 239 పరుగులు చేయడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.మ్యాచ్ ముగిసిన అనంతరం గిల్ మాట్లాడుతూ.. బౌలర్లు ఇప్పటికే సుదీర్ఘంగా బౌలింగ్ చేశారని, మరో ఐదు నుంచి పది ఓవర్లు వేసినా పెద్దగా ప్రయోజనం ఉండదని భావించినట్లు తెలిపాడు. భారత ఫాస్ట్ బౌలర్లు ఒక్కొక్కరు దాదాపు 50 ఓవర్లు బౌలింగ్ చేయడంతో అలసిపోయారని వివరించాడు. మరో మూడు రోజుల్లోనే తదుపరి టెస్టు ప్రారంభం కానుండటంతో ఆటగాళ్లకు విశ్రాంతి కల్పించడం ముఖ్యమని పేర్కొన్నాడు. ప్రయాణం కూడా ఉండటంతో బౌలర్లను మరింత అలసటకు గురిచేయకూడదని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాడు. మరోవైపు వెల్లింగ్టన్ పిచ్‌పై కూడా గిల్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. బౌలర్లకు అనుకూలంగా పిచ్ నుంచి తగినంత సహకారం లభించలేదని అభిప్రాయపడ్డాడు. కొంతైనా సహకారం లభించి ఉంటే విజయం కోసం మరింత ప్రయత్నించే అవకాశం ఉండేదని పేర్కొన్నాడు.

చివరి రోజు భారత బౌలర్లు కొన్ని అవకాశాలు సృష్టించినప్పటికీ వాటిని వికెట్లుగా మలచలేకపోయారని తెలిపాడు. పిచ్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మ్యాచ్‌ను ముగించడమే సరైన నిర్ణయమని జట్టు భావించినట్లు వివరించాడు.ఈ డ్రా భారత జట్టు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలపైనా ప్రభావం చూపింది. భారీ ఆధిక్యం సాధించినప్పటికీ విజయాన్ని అందుకోలేకపోవడం టీమిండియాకు నిరాశ కలిగించే అంశం. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో భారత్ నాలుగో స్థానంలో కొనసాగుతోంది. తదుపరి మ్యాచ్‌లో తప్పనిసరిగా మెరుగైన ప్రదర్శన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో టెస్టు నవంబర్ 27 నుంచి క్రైస్ట్‌చర్చ్‌లో ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లో బౌలర్లకు అనుకూలించే పిచ్ లభిస్తే విజయం సాధించగలమనే ఆశాభావాన్ని గిల్ వ్యక్తం చేశాడు. తొలి టెస్టులో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని జట్టు వ్యూహాలను సిద్ధం చేసుకోనుంది. బౌలర్లకు తగిన విశ్రాంతి కల్పించడం, తదుపరి మ్యాచ్‌కు పూర్తి ఫిట్‌నెస్‌తో సిద్ధం చేయడం జట్టు యాజమాన్యం ముందున్న ప్రాధాన్యతలుగా మారాయి. మొత్తానికి విజయం కోసం చివరి వరకు ప్రయత్నించాలా? లేక ఆటగాళ్ల ఆరోగ్యం, తదుపరి మ్యాచ్ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని డ్రాతో సరిపెట్టుకోవాలా? అనే విషయంలో గిల్ తీసుకున్న నిర్ణయం చర్చకు దారితీసింది. అయితే సుదీర్ఘమైన టెస్టు మ్యాచ్‌లలో ఆటగాళ్ల పనిభారాన్ని పరిగణనలోకి తీసుకోవడం కూడా జట్టు విజయావకాశాలకు కీలకమే. ఇప్పుడు అందరి దృష్టి క్రైస్ట్‌చర్చ్ టెస్టుపైనే ఉంది. తొలి మ్యాచ్‌లో చేజారిన విజయాన్ని రెండో టెస్టులో అందుకుని సిరీస్‌లో ఆధిక్యం సాధిస్తుందో లేదో చూడాలి.

గిల్ కెప్టెన్సీపై గవాస్కర్ ప్రశంసలు

● నాయకత్వంలో పరిణతి.. బ్యాటింగ్‌లో నిలకడ..

యువ కెప్టెన్ ఆటతీరుపై దిగ్గజ క్రికెటర్ ప్రశంసల జల్లు



స్పోర్ట్స్ డెస్క్: భారత యువ టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌పై దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ప్రశంసలు కురిపించాడు. న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరుగుతున్న తొలి టెస్టులో గిల్ ప్రదర్శన, అతడి ఆత్మవిశ్వాసం, బ్యాటింగ్ శైలిపై ప్రశంసలు వ్యక్తం చేశాడు. మైదానంలోకి అడుగుపెట్టినప్పటి నుంచే గిల్ ఎంతో నమ్మకంగా కనిపిస్తున్నాడని, పరుగులు సాధించాలనే తపన అతడిలో స్పష్టంగా కనిపిస్తోందని కొనియాడాడు.ఈ మ్యాచ్‌లో గిల్ అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. కేవలం రెండు పరుగుల తేడాతో శతకాన్ని చేజార్చుకున్నప్పటికీ అతడి ఇన్నింగ్స్ భారత జట్టుకు ఎంతో ఉపయోగపడింది. 146 బంతులు ఎదుర్కొన్న గిల్ తొమ్మిది ఫోర్లు, రెండు సిక్సర్లతో 98 పరుగులు సాధించాడు. శతకానికి చేరువైన సమయంలో న్యూజిలాండ్ బౌలర్ జాకబ్ డఫీ బౌలింగ్‌లో వికెట్ కోల్పోయాడు. అయితే గిల్ ఆడిన తీరు క్రికెట్ విశ్లేషకులను ఆకట్టుకుంది.సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో మ్యాచ్‌పై జరిగిన చర్చ సందర్భంగా గవాస్కర్ మాట్లాడుతూ.. గిల్ పూర్తిగా నమ్మదగిన ఆటగాడని, బ్యాటింగ్‌కు వచ్చినప్పుడు ఎంతో ఆత్మవిశ్వాసంతో కనిపిస్తాడని పేర్కొన్నాడు. క్రీజులో ఉండటానికి ఇష్టపడని సందర్భం అతడి ఆటలో కనిపించదని, మొదటి బంతి నుంచే పరుగులు సాధించాలనే లక్ష్యంతో ఆడతాడని ప్రశంసించాడు. తొలి బంతి నుంచే ఎంతో దృఢంగా, ప్రత్యర్థి బౌలర్లకు లొంగని విధంగా ఆడాడని అభిప్రాయపడ్డాడు. మరోవైపు న్యూజిలాండ్ మాజీ పేసర్ సైమన్ డౌల్ కూడా గిల్ ఆటతీరును ప్రశంసించాడు. టెస్టు క్రికెట్‌లో వ్యక్తిగత శతకాలకు ప్రాధాన్యత ఉన్నప్పటికీ, కెప్టెన్‌గా జట్టును గెలిపించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నాడు. గిల్ కెప్టెన్సీ బాధ్యతలను ఆస్వాదిస్తున్నాడని, నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేయడంలోనూ సౌకర్యంగా కనిపిస్తున్నాడని తెలిపాడు. అతడి ఆటను చూడటం ఎంతో ఆనందంగా ఉందని వ్యాఖ్యానించా డు.గతంతో పోలిస్తే టెస్టు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత గిల్ బ్యాటింగ్‌లో మరింత పరిణతి ప్రదర్శిస్తున్నాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేస్తూ జట్టుకు అవసరమైన సమయంలో పరుగులు సాధిస్తున్నాడు. నాయకత్వ బాధ్యతలు, వ్యక్తిగత బ్యాటింగ్ ప్రదర్శన రెండింటినీ సమన్వయం చేసుకు ంటూ ముందుకు సాగుతున్నాడు. జట్టులోని యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేయడంతో పాటు కీలక సమయాల్లో తానే ముందుండి పరుగులు సాధించడం అతడి ప్రత్యేకతగా నిలుస్తోంది. ఇక న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో భారత జట్టు భారీ స్కోరు సాధించినప్పటికీ మ్యాచ్ డ్రాగా ముగియడం గమనార్హం. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 720 పరుగులు చేసి భారీ ఆధిక్యాన్ని సంపాదించింది.

అయితే రెండో ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ బ్యాటర్లు పట్టుదలగా ఆడటంతో భారత బౌలర్లకు విజయం అందుకోలేకపోయారు. ఈ ఫలితం ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత్ అవకాశాలపై కూడా ప్రభావం చూపింది. అయినప్పటికీ గిల్ వ్యక్తిగత ప్రదర్శన, నాయకత్వంపై మాజీ క్రికెటర్లు సానుకూలంగా స్పందించడం విశేషం.

కెప్టెన్సీ ఒత్తిడిని అధిగమిస్తూ బ్యాటింగ్‌లో నిలకడ చూపిం చడం అతడిలోని ప్రతిభకు నిదర్శనం. భవిష్యత్తులోనూ ఇదే ఆటతీరును కొనసాగిస్తే భారత టెస్టు జట్టుకు గిల్ నాయకత్వం మరింత బలాన్ని చేకూర్చే అవకాశం ఉంది. శతకం చేజారినా దిగ్గజాల ప్రశంసలు అందుకున్న గిల్ ఇప్పుడు తదుపరి మ్యాచ్‌లో విజయం సాధించడంపై దృష్టి సారించనున్నాడు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

ప్రేమ, బ్రేకప్ రెండూ కష్టమేనంటున్న మీనాక్షి చౌదరి



టాలీవుడ్ హీరోయిన్ మీనాక్షి చౌదరి తనదైన చలాకీ మాటలతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. నాగచైతన్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'వృషకర్మ' ప్రమోషన్లలో చురుగ్గా పాల్గొంటున్న ఆమె, తన వ్యక్తిగత జీవితంపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో యాంకర్... 'ప్రస్తుతం మీకు ఎవరిపైనైనా క్రష్ ఉందా?' అని మీనాక్షిని ప్రశ్నించారు. దీనికి ఆమె ఏమాత్రం తడుముకోకుండా నవ్వుతూ బదులిచ్చారు. "నాకు ఎవరిపైనా ఎలాంటి క్రష్ లేదు.. అసలు నా జీవితమే క్రష్ అయిపోయింది (నలిగిపోయింది)" అంటూ చమత్కరించారు. వరుస ప్రాజెక్టులు, తీరికలేని షూటింగులు, ప్రమోషన్స్ వల్ల వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించలేకపోతున్న విషయాన్ని ఆమె ఈ విధంగా సరదాగా వివరించారు.

అలాగే ప్రేమ, రిలేషన్‌షిప్‌లపై అడిగిన మరో ప్రశ్నకు స్పందిస్తూ.. "నాకు తెలియదు కానీ.. ప్రేమలో పడటం, బ్రేకప్ నుంచి బయటపడటం రెండూ కష్టమే" అని మీనాక్షి వ్యాఖ్యానించారు. 'లక్కీ భాస్కర్', 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి విజయాలతో మంచి జోరుమీదున్న ఈ బ్యూటీ, ప్రస్తుతం తన పూర్తి దృష్టిని సినిమాలపైనే పెట్టినట్లు స్పష్టమవుతోంది.

కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర మరియు సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'వృషకర్మ' డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్ర ట్రైలర్‌ను నవంబర్ 25న నెల్లూరులో ఘనంగా విడుదల చేసేందుకు చిత్ర బృందం ఏర్పాట్లు చేస్తోంది.



కిరణ్ అబ్బవరం కొత్త సినిమా 'రికార్డ్'.. పూజాకార్యక్రమాలతో ప్రారంభం

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న తాజా చిత్రం 'రికార్డ్' లాంఛనంగా ప్రారంభమైంది. ఇది ఆయన కెరీర్‌లో 14వ చిత్రంగా రూపుదిద్దుకుంటోంది. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో సోమవారం ఈ చిత్ర పూజా కార్యక్రమాలు జరిగాయి.ఈ పూజా కార్యక్రమానికి టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు సుకుమార్, నిర్మాతలు దిల్ రాజు, బన్నీ వాసు ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ చిత్రానికి వీర కొగటం దర్శకత్వం వహిస్తున్నారు. ఆయనకు దర్శకుడిగా ఇదే మొదటి సినిమా కావడం విశేషం. ప్రముఖ నిర్మాణ సంస్థ 'సుకుమార్ రైటింగ్స్' ఈ ప్రాజెక్ట్‌ను సమర్పిస్తుండగా, నిర్మాతలు వంశీ నందిపాటి, అశోక్ బండ్రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు.చిత్ర ప్రారంభోత్సవం సందర్భంగా విడుదల చేసిన టైటిల్ పోస్టర్ సినీ ప్రియులను ఆకట్టుకుంటోంది. 'రికార్డ్' అనే టైటిల్‌కు తగినట్లుగానే కెమెరా ఇంటర్‌ఫేస్ థీమ్‌తో ఈ పోస్టర్‌ను డిజైన్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వీర మాట్లాడుతూ.. ఈ సినిమా కథ కర్నూలులోని ప్రసిద్ధ కొండారెడ్డి బురుజు నేపథ్యంలో సాగుతుందని వెల్లడించారు. సరికొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఒక ప్రత్యేక అనుభూతిని ఇస్తుందని చిత్ర బృందం భావిస్తోంది.

మరోవైపు, కిరణ్ అబ్బవరం ప్రస్తుతం తాను స్వయంగా దర్శకత్వం వహిస్తున్న 'రియాలిటీ' అనే చిత్ర పనుల్లో కూడా బిజీగా ఉన్నారు. ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'రియాలిటీ' విడుదలకు సిద్ధమవుతున్న సమయంలోనే ఆయన తన 14వ చిత్రాన్ని పట్టాలెక్కించడం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. త్వరలోనే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను అధికారికంగా ప్రకటించనున్నారు.

ప్రభుదేవా డైరెక్షన్‌లో మంచు విష్ణు సినిమా..



టాలీవుడ్ ప్రముఖ నటుడు, నిర్మాత మంచు విష్ణు హీరోగా ఇండియన్ మైఖేల్ జాక్సన్ ప్రభుదేవా దర్శకత్వంలో భారీ బహుభాషా చిత్రం తెరకెక్కనుంది. విష్ణు పుట్టినరోజు సందర్భంగా ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. తెలుగు, తమిళ భాషల్లో రూపొందనున్న ఈ పక్కా యాక్షన్ థ్రిల్లర్‌కు తాత్కాలికంగా »#VM24» అనే వర్కింగ్ టైటిల్ ఖరారు చేశారు. సినీ ప్రియులను అమితంగా ఆకట్టుకునే ఈ కాంబినేషన్ ప్రకటనతో ఇరు పరిశ్రమల్లో అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.

సోషల్ మీడియా వేదికగా విష్ణుకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ ప్రభుదేవా ఈ విషయాన్ని పంచుకున్నాడు. "నా హీరో, తమ్ముడు మంచు విష్ణుకు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఈ వేడుకను మరింత ప్రత్యేకం చేస్తూ ప్రకటిస్తున్నాం. ప్రభుదేవా శ మంచు విష్ణు" అంటూ రాసుకొచ్చాడు. ఈ ప్రాజెక్ట్‌తో విష్ణు నేరుగా కోలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్నాడు. చెన్నైలోనే పుట్టి పెరిగిన విష్ణుకు తమిళ భాషపై మంచి పట్టు ఉండటంతో పాటు అక్కడి సంస్కృతితో ప్రత్యేక అనుబంధం ఉంది. 'ఢీ', 'దేనికైనా రెడీ', 'దూసుకెళ్తా' వంటి విజయాలతో పాటు ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్ వంటి అగ్ర తారలతో భారీ పౌరాణిక చిత్రం 'కన్నప్ప'ను తీసిన తర్వాత ఆయన నుంచి వస్తున్న చిత్రమిది.మరోవైపు 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా' చిత్రంతో దర్శకుడిగా మారి 'పోకిరి' (తమిళ సినిమా), 'రౌడీ రాథోడ్', 'వాంటెడ్' వంటి బ్లాక్‌బస్టర్లను అందించిన ప్రభుదేవా.. ఈ సినిమాతో మళ్లీ తెలుగు తెరపైకి దర్శకుడిగా రీఎంట్రీ ఇస్తున్నాడు. కథ, శీర్షిక, ఇతర నటీనటుల వివరాలు ఇంకా వెల్లడి కాలేదు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం.

సినిమాలే జీవితం కాదు..

ఆ గ్యాప్ నాకోసం: నిత్యా మేనన్



నటనకు ప్రాధాన్యతనిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి నిత్యా మేనన్, తన కెరీర్‌లో తరచుగా తీసుకునే విరామాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమాలే జీవితం కాదని, వ్యక్తిగత జీవితానికి కూడా సమయం కేటాయించుకోవాలనేది తన అభిప్రాయమని స్పష్టం చేశారు. చాలామంది హీరోయిన్లు వరుస అవకాశాలతో బిజీగా ఉండాలనుకుంటే, తాను మాత్రం అందుకు భిన్నంగా ఆలోచిస్తానని తెలిపారు.

ఒక సినిమా పూర్తయ్యాక వెంటనే మరో ప్రాజెక్ట్‌లో చేరకుండా కొంత గ్యాప్ తీసుకోవడం తనకు అలవాటని నిత్య తెలిపారు. ఈ విరామ సమయాన్ని తనను తాను కొత్తగా ఆవిష్కరించుకోవడానికి, కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఉపయోగించుకుంటానని చెప్పారు. వరుసగా సినిమాలు చేస్తూ నిరంతరం కెమెరా ముందు ఉండటం తనకు సాధ్యం కాదని, ప్రతి పాత్రలో సహజంగా ఒదిగిపోవాలంటే నటీనటులకు మానసిక సన్నద్ధత అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు.'అలా మొదలైంది' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన నిత్యా మేనన్, తొలి సినిమాతోనే తన సహజ నటనతో మెప్పించారు. ఆ తర్వాత 'ఇష్క్', 'గుండెజారి గల్లంతయ్యిందే', 'మళ్ళీ మళ్ళీ ఇది రాని రోజు' వంటి చిత్రాలతో స్టార్‌డమ్ అందుకున్నారు. కమర్షియల్ చిత్రాలతో పాటు 'అ!', 'భీమ్లా నాయక్' వంటి విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటూ నటిగా తనదైన ముద్ర వేశారు.

నటన మాత్రమే కాకుండా గాయనిగా, డబ్బింగ్ ఆర్టిస్టుగా కూడా నిత్య తన ప్రతిభను చాటుకున్నారు. ఇటీవల ఓటీటీలో 'మోడరన్ లవ్ హైదరాబాద్' సిరీస్‌తోనూ ఆకట్టుకున్నారు. ఈ ఏడాది నిర్మాణ రంగంలోకి కూడా అడుగుపెట్టి తన కెరీర్‌ను మరో మలుపు తిప్పారు. ప్రస్తుతం ఆమె నటించిన 'మిస్టర్ అండ్ మిసెస్ గ్రే' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. డిసెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ప్రమోషన్ల సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. కెరీర్ పట్ల నిత్యా మేనన్ అనుసరిస్తున్న ఈ విలక్షణమైన వైఖరి అందరినీ ఆకట్టుకుంటోంది.

ఆమె వల్లే చాలా నేర్చుకున్నా

శోభితతో సీక్రెట్ లవ్, పెళ్లి విశేషాలు పంచుకున్న నాగచైతన్య!

తన రాబోయే చిత్రం 'వృషకర్మ' ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న టాలీవుడ్ హీరో నాగచైతన్య, తన అర్ధాంగి శోభిత ధూళిపాళ్లపై ప్రశంసల వర్షం కురిపించాడు. 'ఆనెస్ట్ టౌన్‌హాల్' వేదికగా ఒక అభిమాని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. శోభితలో తనకు బాగా నచ్చేది ఆమెలోని డైనమిక్ నేచర్ అని వెల్లడించాడు. ఇక ర్యాపిడ్ ఫైర్ రౌండ్‌లో శోభితను ఒకే ఒక్క పదంలో వర్ణించమంటే ఏమాత్రం తడుముకోకుండా 'ప్రేమ' అని సమాధానమిచ్చి ఆకట్టుకున్నాడు.



శోభిత వ్యక్తిత్వాన్ని వివరిస్తూ.. ఆమె భారతీయ సంస్కృతి, ఆధునిక భావజాలం కలబోసిన అందమైన వ్యక్తిత్వమని చైతన్య పేర్కొన్నాడు. కొత్త విషయాలను అన్వేషించడంలో ఆమె ఎప్పుడూ ముందుంటుందని చెప్పాడు. "ఉదాహరణకు మేం ఏదైనా హాలిడే టూర్‌కు వెళ్లినప్పుడు నాకంటూ ఒక నిర్దిష్టమైన ప్లాన్ ఉంటుంది. ఒకవేళ ఆ ప్లాన్ అమలు కాకపోతే నా మైండ్ బ్లాంక్ అవుతుంది. కానీ శోభిత మాత్రం ఏమాత్రం తడబడకుండా అక్కడికక్కడే సరికొత్త ప్లాన్‌ను సిద్ధం చేసి ముందుకు నడిపిస్తుంది. ఆమె కారణంగానే పరిస్థితులకు తగినట్లు అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవడం నేర్చుకున్నాను. ఆమెలోని ఆ ఉత్సాహం, కుతూహలం నాకు చాలా ఇష్టం" అని చెప్పుకొచ్చాడు.తమ పరిచయం, పెళ్లి ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ.. నాగార్జునను కలిసేందుకు శోభిత వచ్చిన సమయంలోనే తొలిసారి తాము కలిశామని తెలిపాడు. ఆ తర్వాత ప్రైవేట్‌గా డేటింగ్ మొదలైంది. వెకేషన్‌లో ఓ చెఫ్ వీరి ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వీరి బంధం బయటపడింది. రెండేళ్ల పాటు డేటింగ్‌లో ఉన్న ఈ జంట, 2024 ఆగస్టులో నిశ్చితార్థం చేసుకొని, అదే ఏడాది డిసెంబర్‌లో అన్నపూర్ణ స్టూడియోస్‌లో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. గతంలో శోభితపై వచ్చిన ట్రోలింగ్‌పై చైతూ స్పందిస్తూ.. ఆమెకు తన గతం గురించి ఏమీ తెలియదని, ఆమె ప్రమేయం ఏమీ లేకుండానే కొందరు నిందించడం బాధ కలిగించిందని పేర్కొన్నాడు. కాగా, కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో చైతన్య నటిస్తున్న 'వృషకర్మ' చిత్రం డిసెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613